ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 128, పేజీలు - 08

ఆదివారం, నవంబర్ 8, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD



ఎల్‌నినో ముప్పు..
ఆరుతడి పంటలే మేలు

- రైతులు అప్రమత్తంగా ఉండాలన్న సీఎం రేవంత్

- సంక్రాంతి తర్వాత అన్ని జిల్లాల్లో పర్యటిస్తానన్న సీఎం రేవంత్ - ఎల్‌నినోతో వర్షాభావ పరిస్థితులుంటాయని ప్రజలకు అప్రమత్తం

- ప్రాజెక్టుల్లోని నీళ్లు తాగునీటికే సరిపోతాయని స్పష్టీకరణ - రైతులు ఆరుతడి పంటలే సాగు చేయాలని సూచన

- గడ్డం పెంచుకున్నంత మాత్రాన తనలా మారలేరంటూ కేటీఆర్‌పై విమర్శలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఎల్‌నినో ప్రభావం, మారుతున్న వాతావరణ పరిస్థితులు రాష్ట్ర వ్యవసాయ రంగానికి సవాలుగా మారనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాబోయే ఎనిమిది నెలలు గడ్డుకాలం తప్పదని, వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలున్నందున నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. పంటలు వేసే ముందు పరిస్థితులను బేరీజు వేసుకోవాలని, తొందరపాటు నిర్ణయాలతో నష్టపోవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. కష్టకాలంలో ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని, ఎల్‌నినో

2లో..

ధైర్యం ఉంటే నాపై బుల్డోజర్లు పంపండి
- మమత బెనర్జీ సవాల్



కోల్‌కతా (ప్రశ్న న్యూస్) పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బీజేపీ లక్ష్యంగా తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాళీ పూజ, దీపావళి పండుగల సమయంలో కోల్‌కతాలోని తమ నివాస ప్రాంతంలో రాజకీయ ఉద్రిక్తతలు సృష్టించడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆరోపణలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ ఇంటి సమీపంలో అర్ధరాత్రి వేళ దాడులకు పాల్పడ్డారని, ఉద్దేశపూర్వకంగానే గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించారని మండిపడ్డారు. పండగ వేడుకలు జరుగుతున్న సమయంలో వేకువ జామున 2, 3 గంటల ప్రాంతంలో గుండాలతో దాడులకు తెగబడటం అత్యంత హేయమైన చర్య అని మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. ఏళ్లుగా తమ నియోజకవర్గంలో సాగుతున్న సాంప్రదాయ కాళీ పూజల నిర్వహణను అడ్డుకోవడానికే బీజేపీ ఈ రకమైన చర్యలకు దిగుతోందని విమర్శించారు.

2లో..

ఎమ్మెల్సీ పోరు..
రామచంద్రరావుకు అగ్నిపరీక్ష.?

- గెలిస్తే అధ్యక్ష పీఠం మరింత పదిలం, ఓడితే నాయకత్వానికే ముప్పు!

- బీజేపీలో హాట్‌టాపిక్‌గా మారిన రాష్ట్ర అధ్యక్షుడి పోటీ నిర్ణయం

- బండి సంజయ్ రీ-ఎంట్రీకి రంగం సిద్ధమవుతోందా?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు కేంద్రంగా మారింది. ఈ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు స్వయంగా బరిలోకి దిగాలని నిర్ణయించుకోవడం, అందుకు పార్టీ అధిష్ఠానం కూడా సుముఖత వ్యక్తం చేసినట్లు ప్రచారం సాగుతుండటం కమలదళంలో చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా విజయం సాధించిన అనుభవం

2లో..

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి
- భారీ అవకతవకలు జరిగాయన్న కేటీఆర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకం టెండర్లలో భారీ అవకతవకలు జరిగాయని, మంత్రి

2లో..

పల్లెల్లో పసుపు ప్రభంజనం

- పరిషత్ ఎన్నికల్లో కూటమి విజయదుందుభి.. - జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ కూటమి హవా

- చంద్రబాబు నాయకత్వానికి గ్రామీణ ఓటర్ల జైకొట్టు - జనసేన, బీజేపీతో సమన్వయానికి కలిసొచ్చిన ప్రజాదరణ

- పల్నాడు నుంచి పులివెందుల వరకు కూటమి శ్రేణుల్లో విజయోత్సాహం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ పల్లెల్లో పసుపు ప్రభంజనం కనిపించింది! గ్రామీణ రాజకీయాల్లో మరోసారి తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి తన సత్తా చాటుకుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేయడంతో టీడీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. చంద్రబాబు నాయకత్వం, కూటమి ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో ఉన్న ఆదరణ ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించిందని కూటమి నేతలు విశ్లేషిస్తున్నారు. పల్లె ఓటరు ఇచ్చిన తీర్పు కూటమి రాజకీయ బలాన్ని మరింత పెంచిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి

2లో..

విశాఖలో ప్రపంచ పెట్టుబడుల పండుగ

- 59 దేశాలు, 15 మంది విదేశీ మంత్రులు, 1,250 మంది ప్రతినిధులు

- నవంబర్ 12, 13 తేదీల్లో 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026

- 400 బిజినెస్ సమావేశాలతో పెట్టుబడులకు బాటలు

- అంతర్జాతీయ పారిశ్రామిక దిగ్గజాలకు ఆహ్వానం

- ఏపీలో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యమన్న సీఎం చంద్రబాబు



అమరావతి(ప్రశ్న న్యూస్) విశాఖపట్నం మరోసారి ప్రపంచ పారిశ్రామిక రంగం దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమవుతోంది. సముద్ర తీర నగరం వేదికగా ప్రపంచ పెట్టుబడుల వేటకు ఆంధ్రప్రదేశ్ తెరలేపుతోంది. అంతర్జాతీయ వాణిజ్యం, ఆధునిక సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, యువతకు ప్రపంచస్థాయి ఉపాధి అవకాశాలు ఇలా భవిష్యత్ ఆర్థిక వ్యవస్థను శాసించనున్న కీలక రంగాలన్నీ ఒకే వేదికపైకి రానున్నాయి. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్-2026కు సర్వం సిద్ధమవుతోంది. 59 దేశాలు 15 మంది విదేశీ మంత్రులు 40 మందికి పైగా అంతర్జాతీయ పక్షలు 350 మంది విదేశీ ప్రతినిధులు 900 మంది దేశీయ ప్రతినిధులు మొత్తంగా 1,250 మందికి పైగా

3లో..

భర్తలు తెస్తారు.. భార్యలు అమ్మేస్తారు!
- అల్వాల్‌లో డిఫెన్స్ మద్యం అక్రమ దందా



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో డిఫెన్స్ క్యాంటీన్ మద్యం అక్రమ విక్రయాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. సైనికులకు రాయితీపై అందించే మద్యాన్ని క్యాంటీన్ కోటా ద్వారా కొనుగోలు చేసి బయట వ్యక్తులకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో మహిళలు తమ ఇళ్ల నుంచే మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించారు. అల్వాల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిపిన తనిఖీల్లో మొత్తం 163 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు.

2లో..

ప్రజా విజయమే అసలైన దీపావళి వెలుగు

- అభివృద్ధి కాంతులతో ఏపీకి కొత్త వెలుగులు

- స్థానిక ఎన్నికల్లో కూటమికి ప్రజల పట్టాభిషేకం

- ముందుగానే పండుగ సంబరాలు

- రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం పవన్ దీపావళి శుభాకాంక్షలు



అమరావతి(ప్రశ్న న్యూస్) చీకటిపై వెలుగు విజయం సాధించినట్లే విధ్వంసంపై అభివృద్ధి విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

2లో..

చీకటిపై వెలుగుల విజయం

- దేశ ప్రజలకు రాష్ట్రపతి, ప్రధాని దీపావళి శుభాకాంక్షలు!



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారతీయ విలువలను అనుసరిస్తూ వికసిత్ భారత్ నిర్మాణంలో యువత ఉత్సాహంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని, సమాజంలో సౌభ్రాతృత్వంతో మెలగాలని సూచించారు. దేశంలో, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగకు సాంస్కృతికంగా, ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం ఉందని రాష్ట్రపతి పేర్కొన్నారు. రావణుడిపై

2లో..



ఎల్‌నినో ముప్పు.. ఆరుతడి పంటలే మేలు

ప్రభావంతో ఏర్పడే కరవు పరిస్థితులను సమష్టిగా ఎదుర్కొందామని పిలుపునిచ్చారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని హకీంపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ముఖ్యమంత్రి ప్రారంభించారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో వర్షాలు తగ్గడంతో పాటు ఎండల తీవ్రత పెరుగుతోందని, రానున్న రోజుల్లో నీటి కొరత మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

రైతులకు అండగా ప్రభుత్వం

రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ "మీకన్నా నాకు ఆత్మబంధువులెవరూ లేరు. రాబోయే రోజుల్లో ఎండలు విపరీతంగా ఉండనున్నాయి. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవు. నీరు తక్కువగా అవసరమయ్యే ఆరుతడి పంటలను సాగు చేయండి. పంటలు వేసే ముందు ఒకసారి ఆలోచించండి. ఇప్పటి నుంచి వచ్చే జూలై వరకు పరిస్థితులు అనుకూలంగా ఉండకపోవచ్చు. రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటిని నమ్మవద్దు. ఇబ్బందికర పరిస్థితుల్లో ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. సంక్రాంతి తర్వాత ప్రజాబలం కార్యక్రమం చేపట్టి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తా. రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకుని వారికి తోడుగా ఉంటా. మనమంతా ఏకమై ఎల్‌నినోను ఎదుర్కొందాం" అని పేర్కొన్నారు.

జలవనరులపై ప్రత్యేక చర్చ

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటిపోయాయని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఒకప్పుడు ఇదే సమయానికి వందల టీఎంసీల నీటితో కళకళలాడిన ప్రాజెక్టులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయని అన్నారు. కరవు పరిస్థితులపై కొందరు చేస్తున్న విమర్శలకు సమాధానంగా సాగునీటి ప్రాజెక్టుల వాస్తవ పరిస్థితులను వివరించారు. కాళేశ్వరం సహా గోదావరి, కృష్ణా జలాల వినియోగం, ప్రస్తుత పరిస్థితులపై డిసెంబర్‌లో రెండు, మూడు రోజుల పాటు శాసనసభ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. సమగ్రంగా చర్చించి ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

మేడిగడ్డ వల్లే పంపులకు ఇబ్బంది

గోదావరిలో ప్రవహించే నీటిని ఎత్తిపోవడం లేదంటూ కొందరు విమర్శిస్తున్నారని, ప్రవహించే నీటిని ఎత్తిపోయడానికి బ్యారేజీలు ఎందుకని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. మేడిగడ్డ కుంగిపోవడం వల్ల కన్నెపల్లి పంపుహౌస్ పంపులు పనిచేయడం లేదని వివరించారు. మేడిగడ్డ గేట్లు మూసి 16 టీఎంసీల నీటిని నిల్వ చేసినప్పుడే పంపుహౌస్‌లోకి నీరు చేరి ఎత్తిపోసే అవకాశం ఉంటుందని తెలిపారు.
తుపాకులగూడెం వద్ద నీటిని నిల్వ చేసి దేవాదుల ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్నామని, ఆ నీటిని ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ద్వారా వినియోగిస్తున్నామని చెప్పారు. నీటిని ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నారనే ఆరోపణలను తోసిపుచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిధిలో ఒక్క ఎకరా ఆయకట్టు కూడా లేదని, ఈ మూడు బ్యారేజీలు ఏకకాలంలో పనిచేసినప్పుడే శ్రీపాద ఎల్లంపల్లికి నీరు చేరుతుందని వివరించారు. దేవాదుల ద్వారా రైతులకు సాగునీరు అందిస్తున్నామని పేర్కొన్నారు.

పాలమూరు ప్రాజెక్టులపై ఆవేదన

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పాలమూరు జిల్లాలో తాగునీరు, సాగునీటి సమస్యలు పరిష్కారం కాలేదని ముఖ్యమంత్రి అన్నారు. పారిశ్రామిక అభివృద్ధి కూడా ఆశించిన స్థాయిలో జరగలేదని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పాలమూరు ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతాయని, తమ ప్రాంతానికి న్యాయం జరుగుతుందని ప్రజలు ఆశించారని గుర్తుచేశారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు-రంగారెడ్డి, మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాలు పూర్తయి పొలాలకు నీరందుతాయని రైతులు ఎదురుచూశారని, కానీ ఏ ఒక్క ప్రాజెక్టు కూడా ఆశించిన వేగంతో ముందుకు సాగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్-ఎల్‌బీసీ పూర్తయి ఉంటే నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారమయ్యేదని అన్నారు. అచ్చంపేట ఎత్తిపోతల, సీతారామసాగర్ వంటి ప్రాజెక్టులూ పూర్తికాలేదని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభించి, చేవెళ్ల, వికారాబాద్, తాండూరు ప్రాంతాలకు నీటిని తరలించాలని ప్రణాళిక రూపొందించారని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టు కోసం అప్పట్లో రూ.15 వేల కోట్లు ఖర్చు చేశారని తెలిపారు.

ఎకరాకు రూ.20 లక్షల పరిహారం

ప్రజల ఆశీర్వాదం, దేవుడి కరుణ, అందరి సహకారంతో కొడంగల్‌కు అభివృద్ధి అవకాశాలు దక్కాయని ముఖ్యమంత్రి అన్నారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని, ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం చెల్లించి భూములు సేకరించామని వెల్లడించారు.

హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు పారిశ్రామిక హబ్

ఢిల్లీ-నోయిడా, ముంబై-పుణె తరహాలో హైదరాబాద్ నుంచి లగచర్ల వరకు పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి కొడంగల్ వరకు 250 అడుగుల వెడల్పుతో భారీ రహదారిని నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతానికి వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలు రానున్నాయని, స్థానిక నిరుద్యోగ యువతకు పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశానికే అభివృద్ధి నమూనాగా కొడంగల్

ఒకప్పుడు గుర్తింపు కోసం ఎదురుచూసిన తెలంగాణ ఇప్పుడు దేశం దృష్టిని ఆకర్షించే స్థాయికి చేరుకుందని ముఖ్యమంత్రి అన్నారు. అయితే గుర్తింపు మాత్రమే సరిపోదని, రైతుల పొలాలకు నీళ్లు రావాలని, పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షించారు. గ్రామీణ వ్యవసాయ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థలో భాగంగా కొడంగల్‌ను సమగ్ర అభివృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. వైద్య, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, నర్సింగ్, పశువైద్య, న్యాయ విద్యాసంస్థలతో పాటు యంగ్ ఇండియా సమీకృత పాఠశాలలు, సైనిక్ పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పారిశ్రామిక పార్కుల ఏర్పాటుతో ఈ ప్రాంతానికి కొత్త రూపునిస్తామని, రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

ధైర్యం ఉంటే నాపై బుల్డోజర్లు పంపండి

కాళీ మాత ఊరేగింపులు సాగే మార్గాల్లో కావాలనే అడ్డంకులు సృష్టిస్తోన్నారని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ ప్రత్యర్థుల బెదిరింపు ధోరణిపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. బీజేపీకి ధైర్యం ఉంటే తమ శరీరాలపై బుల్డోజర్లు నడపాలని సవాల్ విసిరారు. అర్ధరాత్రి వేళ అల్లరిమూకలతో వచ్చి తమ పార్టీ కార్యకలాపాలు, కాళీ పూజ నిర్వహణను అడ్డుకోవడం అక్రమమని మండిపడ్డారు. జాతీయ స్థాయిలో ఇండియా బ్లాక్ లో తమ పార్టీ కీలక పాత్ర పోషించడమే ఈ కక్షసాధింపు చర్యలకు ప్రధాన కారణమని మమత బెనర్జీ స్పష్టం చేశారు. ఈ రాజకీయ కుట్రల వెనుక పెద్ద ఎత్తున అక్రమ నిధుల పంపిణీ జరుగుతోందని ఆమె ఆరోపించారు. బీజేపీ పార్టీ కార్యాలయం నుంచే నకిలీ అఫిడవిట్లు, బోగస్ స్టాంపులు వస్తున్నాయని విమర్శించారు. బెంగాల్‌లోని కొందరు బీజేపీ నేతలు ఈ నిధులను సరఫరా చేస్తున్నారని, ప్రజల ఓటర్ కార్డులను దుర్వినియోగం చేస్తూ, పోలీసు వ్యవస్థపై ఒత్తిడి తెచ్చి ఫామ్‌లపై సంతకాలు చేయిస్తోన్నారని మమత బెనర్జీ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక జీవితంలో కాళీ పూజ ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యం ఉందని, అలాంటి సంప్రదాయాలను సువేందు అధికారి ప్రభుత్వం తుంగలోకి తొక్కే ప్రయత్నానికి పాల్పడుతోందని మమత బెనర్జీ దుమ్మెత్తిపోశారు. దక్షిణ కోల్‌కతాలోని కాళీఘాట్ ప్రాంతంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, ఎంపీ అభిషేక్ బెనర్జీ నివాసాలు ఉన్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో భద్రత అనేది ఎప్పుడూ సున్నితమైన అంశమే. పండుగ వేళ శాంతిభద్రతల సమస్యలు తలెత్తడం, పూజా కమిటీల అనుమతుల చుట్టూ వివాదాలు ముదరడం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది.

పల్లెల్లో పసుపు ప్రభంజనం

వరకు సాగిన ఎన్నికల ప్రచారం, నాయకుల సమన్వయం, కార్యకర్తల శ్రమ కూటమి విజయాలకు దోహదపడ్డాయి. టీడీపీతో పాటు జనసేన, బీజేపీ శ్రేణులు సమష్టిగా పనిచేయడం కూటమికి అదనపు బలంగా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా వెలువడిన ఫలితాలు కూటమి శ్రేణుల్లో సంబరాలు నింపాయి.

చంద్రబాబు నాయకత్వానికి పల్లె జైకొట్టు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఎన్నికల ప్రచారంలో ప్రధాన అస్త్రాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు, ప్రజా సంక్షేమం వంటి అంశాలను కూటమి నేతలు ప్రజల్లోకి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై విశ్వాసంతోనే గ్రామీణ ఓటర్లు కూటమికి మద్దతుగా నిలిచారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రభుత్వ పనితీరును అంచనా వేసే అవకాశంగా పరిషత్ ఎన్నికలను భావించిన ఓటర్లు తమ తీర్పును బ్యాలెట్ ద్వారా వెల్లడించారు. ఈ ఫలితాలు కూటమి ప్రభుత్వానికి రాజకీయంగా మరింత ఉత్సాహాన్నిచ్చే పరిణామంగా మారాయి.

పసుపు జెండాకు జనసేన, బీజేపీ అండ..

టీడీపీ, జనసేన, బీజేపీ మధ్య ఏర్పడిన రాజకీయ సమన్వయం ఎన్నికల్లో కీలకంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెరగడం, ఉమ్మడి లక్ష్యంతో ప్రచారం నిర్వహించడం కూటమికి కలిసొచ్చింది. టీడీపీ ప్రధాన బలంగా నిలవగా, జనసేన, బీజేపీ భాగస్వామ్యంతో కూటమి రాజకీయ బలం మరింత విస్తరించింది. కూటమి ఐక్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో స్థానిక నాయకత్వం కీలక పాత్ర పోషించింది. గ్రామీణ ప్రాంతాల్లో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పనిచేయడం విజయాలకు దోహదపడిందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

పల్నాడులో విజయోత్సాహం..

పల్నాడు జిల్లాలోనూ కూటమి విజయాలు రాజకీయంగా ప్రత్యేక చర్చకు దారితీశాయి. నరసరావుపేట, క్రోసూరు, నూజెండ్ల తదితర ప్రాంతాల్లో కూటమి అభ్యర్థుల విజయాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. స్థానిక నాయకుల వ్యూహాలు, గ్రామస్థాయి కార్యకర్తల కృషి, ఓటర్ల మద్దతు విజయాలకు బాటలు వేసినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు పులివెందుల వంటి వైసీపీకి రాజకీయంగా బలమైన ప్రాంతాల్లోనూ టీడీపీ సాధించిన జడ్పీటీసీ విజయాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతిపక్షానికి కంచుకోటలుగా భావించే ప్రాంతాల్లోనూ కూటమి తన ఉనికిని చాటుకోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కార్యకర్తల కష్టానికి విజయఫలం..

ఎన్నికల విజయాల్లో క్షేత్రస్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకం. గ్రామాల్లో ఇంటింటి ప్రచారం, స్థానిక సమస్యలపై ప్రజలతో చర్చలు, ఓటర్లను కలుసుకోవడం వంటి కార్యక్రమాలతో కూటమి శ్రేణులు ఎన్నికల సమరంలో చురుగ్గా పాల్గొన్నాయి. నాయకుల నుంచి సాధారణ కార్యకర్తల వరకు సమష్టిగా పనిచేయడం విజయాలకు బలంగా నిలిచింది. పరిషత్ ఎన్నికల ఫలితాలు గ్రామీణ స్థాయిలో పార్టీ సంస్థాగత బలాన్ని అంచనా వేసుకునేందుకు కూడా ఉపయోగపడనున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఇప్పుడు ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత మరింత పెరిగింది.

గెలుపుతో బాధ్యత మరింత పెరిగింది..

ఎన్నికల్లో విజయం సాధించడం ఒక ఎత్తయితే.. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం మరో ఎత్తు. జడ్పీటీసీ, ఎంపీటీసీలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ముందున్న అసలైన సవాలు గ్రామాల అభివృద్ధి. తాగునీటి సమస్యల పరిష్కారం, అంతర్గత రహదారుల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామాల రూపురేఖలు మార్చే దిశగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల విజయాన్ని అభివృద్ధి విజయంగా మార్చినప్పుడే ప్రజల తీర్పుకు నిజమైన గౌరవం లభిస్తుంది.

2029 దిశగా కొత్త ఉత్సాహం..

పరిషత్ ఎన్నికల విజయాలు కూటమికి భవిష్యత్ రాజకీయ ప్రయాణంలో కొత్త ఆత్మవిశ్వాసాన్ని అందించాయి. గ్రామీణ స్థాయిలో బలమైన పునాది ఏర్పరచుకోవడం, పార్టీ శ్రేణులను మరింత క్రియాశీలం చేయడం, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలకు ఈ ఫలితాలు ప్రేరణగా నిలవనున్నాయి. ముఖ్యంగా 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి పార్టీలు తమ రాజకీయ వ్యూహాలకు పదును పెట్టే అవకాశం ఉంది. మొత్తంగా పరిషత్ ఎన్నికల ఫలితాలు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ రాజకీయాల్లో కూటమికి సానుకూల వాతావరణాన్ని సృష్టించాయి. పల్లె ఓటరు ఇచ్చిన మద్దతును పాలనలో ప్రతిఫలింపజేయడం ఇప్పుడు కూటమి ముందున్న ప్రధాన బాధ్యత.

ఎమ్మెల్సీ పోరు.. రామచంద్రరావుకు అగ్నిపరీక్ష.?

రామచంద్రరావుకు ఉన్నప్పటికీ, ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉండి మరోసారి ఎన్నికల బరిలో దిగడం మాత్రం రాజకీయంగా పెద్ద సాహసమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధ్యక్షుడి హోదాలో వ్యక్తిగత పోరు!

సాధారణంగా ఒక రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు రాష్ట్రవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయడం, అన్ని నియోజకవర్గాల్లో ప్రచారాన్ని సమన్వయం చేయడం, ప్రత్యర్థి పార్టీలపై రాజకీయ పోరాటాన్ని ముందుండి నడిపించడం వంటి బాధ్యతలు నిర్వహిస్తుంటారు. అలాంటి కీలక బాధ్యతల్లో ఉన్న వ్యక్తి స్వయంగా ఒక ఎమ్మెల్సీ నియోజకవర్గానికే పరిమితమై ప్రచారం చేయాల్సి రావడం రాజకీయంగా సవాలుతో కూడుకున్న అంశం. ముఖ్యంగా పట్టభద్రులు, విద్యావంతులు అధికంగా ఉన్న ఈ నియోజకవర్గంలో ఫలితం ఏమాత్రం ప్రతికూలంగా వచ్చినా దాని ప్రభావం నేరుగా రామచంద్రరావు నాయకత్వంపై పడే అవకాశం ఉంది. రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండి పోటీ చేసిన ఎన్నికల్లో ఓటమి ఎదురైతే నైతిక బాధ్యత వహిస్తూ పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్న చర్చ కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ పరిణామాలన్నీ తెలిసి కూడా రామచంద్రరావు స్వయంగా పోటీకి సిద్ధమయ్యారా? లేక అధిష్ఠానం వ్యూహంలో భాగంగానే ఆయనను బరిలోకి దించుతున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.
మరోవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై రాజకీయంగా దూకుడు పెంచాల్సిన సమయంలో రాష్ట్ర అధ్యక్షుడే ఒక నియోజకవర్గంలో ప్రచారానికి పరిమితం కావడం పార్టీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన కొందరు నేతల్లో వ్యక్తమవుతోంది. అయితే రామచంద్రరావు అనుచరులు మాత్రం ఈ నిర్ణయాన్ని ఆయన రాజకీయ ఆత్మవిశ్వాసానికి నిదర్శనంగా అభివర్ణిస్తున్నారు. పట్టభద్రుల్లో బీజేపీకి ఉన్న ఆదరణ, సీనియర్ న్యాయవాదిగా రామచంద్రరావుకు ఉన్న గుర్తింపు ఎన్నికల్లో కలిసి వస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

బండి సంజయ్ రీ-ఎంట్రీకి రంగం సిద్ధమా.?

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీ నాయకత్వంపై మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఎన్నికల ఫలితాలను ప్రాతిపదికగా చేసుకుని రాష్ట్ర అధ్యక్షుడి మార్పుపై అధిష్ఠానం కసరత్తు చేస్తోందన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఊపందుకుంటోంది. ఒకవేళ రామచంద్రరావుకు ఆశించిన ఫలితం దక్కకపోతే, ఆ పరిణామాన్ని నాయకత్వ మార్పునకు అవకాశంగా మలుచుకోవచ్చన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్ర సహాయ మంత్రి, మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ పేరు మరోసారి తెరపైకి వస్తోంది. గతంలో ఆయన రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో తెలంగాణ బీజేపీలో కనిపించిన దూకుడు, ఆందోళనలు, క్షేత్రస్థాయి కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహం ప్రస్తుతం కొంత తగ్గిందనే అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు గట్టి పోటీ ఇవ్వాలంటే బండి సంజయ్ వంటి దూకుడైన నాయకత్వం అవసరమని కొందరు నేతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలన్నది అధిష్ఠానం అధికారిక నిర్ణయమా? లేక పార్టీ అంతర్గతంగా సాగుతున్న రాజకీయ చర్చ మాత్రమేనా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల అనంతరం తెలంగాణ బీజేపీలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

గెలిస్తే పట్టు.. ఓడితే పదవికి ముప్పు!

ప్రస్తుత పరిస్థితుల్లో రామచంద్రరావుకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాజకీయంగా కత్తిమీద సాములా మారాయి. విజయం సాధిస్తే రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన నాయకత్వానికి మరింత బలం చేకూరడంతో పాటు పార్టీలో తన పట్టును నిరూపించుకునే అవకాశం ఉంటుంది. అదే సమయంలో ఫలితం ప్రతికూలంగా వస్తే మాత్రం అధ్యక్ష పదవిపై ఒత్తిడి పెరగడంతో పాటు నాయకత్వ మార్పు చర్చలకు బలం చేకూరే అవకాశముంది. మొత్తానికి ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు కేవలం ఒక నియోజకవర్గానికి సంబంధించిన పోటీగానే కాకుండా, తెలంగాణ బీజేపీ భవిష్యత్ నాయకత్వానికి దిశానిర్దేశం చేసే రాజకీయ పరీక్షగా మారుతున్నాయి. రామచంద్రరావు తన రాజకీయ చతురతతో ఈ సవాలును అధిగమిస్తారా? లేక ఎన్నికల ఫలితాలు బండి సంజయ్ రీ-ఎంట్రీకి మార్గం సుగమం చేస్తాయా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

కొడంగల్ టెండర్లలో పొంగులేటి కంపెనీకి లబ్ధి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన కంపెనీకి అనుచిత లబ్ధి చేకూర్చారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 2014లో సుమారు రూ.1,450 కోట్లుగా ఉండగా, దానిని ఇప్పుడు రూ.6,825 కోట్లకు పెంచారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు ఇంకా చుక్క నీరు అందకముందే, అంచనా వ్యయాన్ని దాదాపు ఐదు రెట్లు పెంచి రాష్ట్ర సంపదను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియలో మంత్రి పొంగులేటి కంపెనీ ప్రధాన పోటీదారుగా ఉందని, మిగతా కంపెనీలన్నీ నామమాత్రపు పోటీదారులేనని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై కేటీఆర్ తనదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "క్రోనీ క్యాపిటలిజం, పగటి దోపిడీ అనే పదాలు కూడా ఈ దోపిడీ ముందు చాలా చిన్నవి అయిపోతున్నాయి. రాహుల్ గాంధీ గారూ ఈ దోపిడీని వర్ణించడానికి దయచేసి ఏదైనా కొత్త పదాన్ని వెతకడంలో నాకు సహాయం చేయండి" అని అన్నారు. ప్రజల అవసరాలను పక్కనపెట్టి, ప్రాజెక్టుల పేరుతో అంచనాలు పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని కేటీఆర్ దుయ్యబట్టారు. టెండర్ల ప్రక్రియలో పారదర్శకత లేకుండా, తమకు అనుకూలమైన కంపెనీలకే పనులు కట్టబెట్టేలా కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు ఉన్నాయని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు.

చీకటిపై వెలుగుల విజయం

విజయం సాధించిన అనంతరం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని గుర్తుచేశారు. ఈ వేడుక రామరాజ్య శుభారంభానికి ప్రతీకగా నిలిచిందన్నారు. చెడు లక్షణాలపై సద్గుణాల విజయం, కష్టాల నుంచి విముక్తి పొంది సుఖసంతోషాలతో కూడిన జీవితం ప్రారంభం కావడాన్ని దీపావళి సూచిస్తుందని తెలిపారు. శుభారంభాల కోసం గణేశుడిని, సంపద, శ్రేయస్సు కోసం మహాలక్ష్మిని పూజిస్తూ అందరి సంతోషం కోసం ప్రార్థిస్తారని వివరించారు. దేశ ప్రజలందరికీ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షించారు. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా దీపావళి సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ చీకటిపై వెలుగుల విజయానికి, చీకటిని పారదోలాలన్న సంకల్పానికి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం, శ్రేయస్సు నిండాలని ఆకాంక్షించారు. ఏటా ఉత్సాహంగా దీపావళి జరుపుకుంటానని, ఈసారి కూడా సరిహద్దుల్లో దేశాన్ని కాపాడుతున్న వీర జవాన్లతో కలిసి పండుగ చేసుకోనున్నట్లు వెల్లడించారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను మోదీ కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మరోవైపు ఉపరాష్ట్రపతి అయోధ్యలో నిర్వహించే దీపోత్సవం-2026లో పాల్గొనేందుకు శనివారం అక్కడికి చేరుకున్నారు. శ్రీరామ జన్మభూమి ఆలయంలో పూజలు చేయడంతో పాటు శ్రీరాముడి పట్టాభిషేక కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ ఏడాది దీపోత్సవం పదో వార్షికోత్సవం కావడం విశేషం. అయోధ్యలోని 56 ఘాట్లలో 30 నుంచి 33 లక్షల మట్టి దీపాలు వెలిగించాలని నిర్వాహకులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

ప్రజా విజయమే అసలైన దీపావళి వెలుగు

దీపావళి కేవలం దీపాల పండుగ మాత్రమే కాదని.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన పర్వదినమని పేర్కొన్నారు. దీపకాంతిని పరబ్రహ్మ స్వరూపంగా ఆరాధించే గొప్ప సంస్కృతి భారతీయులదని పవన్ కల్యాణ్ గుర్తుచేశారు. నరకాసురుడి సంహారం అనంతరం ప్రజలకు సుఖసంతోషాలు కలిగిన సందర్భాన్ని స్మరించుకుంటూ దీపాలు వెలిగించి దీపావళి వేడుకలు జరుపుకుంటున్నామని వివరించారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త ఆశలు, ఆశయాలు, విజయాలకు నాంది కావాలని ఆకాంక్షించారు.

అభివృద్ధి దీపాలు.. సంక్షేమ కాంతులు

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అభివృద్ధి కాంతిరేఖలను ప్రసరింపజేస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు మార్గాల్లో రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.

ప్రజల తీర్పే ముందస్తు దీపావళి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలిచారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు, అందిస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు మద్దతు తెలుపుతూ కూటమి పక్షాలకు విజయాన్ని అందించారని అన్నారు. ఈ ప్రజా విజయంతో రాష్ట్రంలో ముందుగానే దీపావళి సంబరాలు వచ్చినట్లయిందని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతతో పనిచేస్తామని పరోక్షంగా స్పష్టం చేశారు. దీపాల వెలుగుల మాదిరిగా రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరికీ సంపూర్ణ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన దీపావళి సందేశంలో పేర్కొన్నారు.

భర్తలు తెస్తారు.. భార్యలు అమ్మేస్తారు!

మల్కాజిగిరి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం లోతుకుంటలోని సరస్వతీనగర్‌లో ఓ ఇంటిపై దాడి చేసింది. మన్యం నాగప్రసన్న, ఆమె భర్త రామ్ ఆంజనేయులు డిఫెన్స్ క్యాంటీన్ మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నారనే సమాచారంతో అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంట్లో నిల్వ ఉంచిన 96 డిఫెన్స్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రదీప్ రావు వెల్లడించిన వివరాల ప్రకారం రామ్ ఆంజనేయులు క్యాంటీన్ కోటా ద్వారా మద్యం బాటిళ్లను సేకరిస్తుండగా, ఆయన భార్య నాగప్రసన్న ఇంటి నుంచే బయట వ్యక్తులకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై ఇద్దరిపైనా కేసు నమోదు చేశారు. నాగప్రసన్నను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఇదే తరహాలో మరో అక్రమ విక్రయ వ్యవహారం న్యూ బోయిన్‌పల్లిలో బయటపడింది. ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ టీమ్-బి సీఐ గణపతి రెడ్డి నేతృత్వంలోని బృందం సౌజన్య కాలనీలోని ఓ ఇంటిపై దాడి చేసింది. తనిఖీల్లో ముసిమి లెంక (39) వద్ద 67 డిఫెన్స్ మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలతో ఆమెను అరెస్టు చేసి అల్వాల్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సీఐ గణపతి రెడ్డి తెలిపారు. అల్వాల్ పరిధిలో జరిగిన ఈ రెండు దాడుల్లో కలిపి 163 డిఫెన్స్ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ.2.11 లక్షలుగా అధికారులు అంచనా వేశారు. రక్షణ శాఖ క్యాంటీన్ల ద్వారా అర్హులైన వారికి రాయితీపై అందించే మద్యాన్ని ఇతరులకు విక్రయించడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది.. క్యాంటీన్ కోటా ద్వారా మద్యం ఎలా సేకరించారు ఇతరుల కోటాలను కూడా ఉపయోగించుకున్నారా అనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు కేసుల్లోనూ తదుపరి విచారణ కొనసాగుతోంది.

'మురుసు తుఫాన్ బాధిత రైతులను తక్షణమే ఆదుకోవాలి'

- బూర్గంపహాడ్ డిప్యూటీ తాసీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి



బూర్గంపహాడ్, బూర్గంపహాడ్ మండలంలో మురుసు తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయకులు డిప్యూటీ తాసీల్దార్ ధనియాల వెంకటేశ్వర్లుకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, సొసైటీ మండల అధ్యక్షుడు బిక్కసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ? తుఫాన్ కారణంగా వరి, పత్తి, మిర్చి తదితర పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు. అధికారులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేసి తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేడం లక్ష్మీనారాయణరెడ్డి, రెడ్డిపాలెం ఉప సర్పంచ్ అప్పిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, సిరిపురం ప్రసాద్, మాజీ వార్డు సభ్యులు కామిరెడ్డి పద్మ, సోము లక్ష్మిచైతన్యరెడ్డి, కురుకుంట్ల చిన్నపరెడ్డి, మూల బాలిరెడ్డి, చేతుల పెద్దవీర్రాజు, బత్తుల రామకొండారెడ్డి, బానోత్ రామదాసు, బాదం అచ్చిరెడ్డి, సాదిక్‌పాషా, సౌకత్‌అలీ, గంగుల చంద్రశేఖర్‌రెడ్డి, ధనుగురి నాగేశ్వరరావు, శనగ అప్పారావు, అనుబంధ సంఘాల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

విశాఖలో ప్రపంచ పెట్టుబడుల పండుగ

ఇంతటి భారీ అంతర్జాతీయ భాగస్వామ్యంతో జరగనున్న ఈ సదస్సు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక భవిష్యత్తుకు కీలక మలుపుగా మారనుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పెట్టుబడుల సదస్సుగా కాకుండా ప్రపంచ దేశాలతో ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక సంబంధాలను బలోపేతం చేసుకునే వేదికగా ప్రభుత్వం దీనిని తీర్చిదిద్దుతోంది.

ప్రపంచానికి విశాఖ ఆహ్వానం

'నావిగేటింగ్ న్యూ వరల్డ్ ఆర్డర్: ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్' అనే ఇతివృత్తంతో రెండు రోజుల పాటు సదస్సు జరగనుంది. మారుతున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాలు దేశాల మధ్య పెట్టుబడుల పోటీ సాంకేతిక విప్లవం వంటి అంశాలపై విస్తృత చర్చలు జరగనున్నాయి. ప్రభుత్వ విధానకర్తలు, పారిశ్రామిక దిగ్గజాలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తలు, అంకుర సంస్థల ప్రతినిధులు ఒకే వేదికపై సమావేశమై భవిష్యత్ వ్యాపార అవకాశాలను అన్వేషించనున్నారు. సింగపూర్, నేపాల్, కంబోడియా, మయన్మార్, యూఏఈ, కెనడా, స్లోవాక్ రిపబ్లిక్, మారిషస్, మొజాంబిక్, ఈజిప్ట్, అల్జీరియా, టాంజానియా, గ్వాటెమాలా తదితర దేశాల ప్రతినిధులు పాల్గొననున్నారు. వివిధ దేశాల రాయబారులతో పాటు ప్రపంచ ఆహార కార్యక్రమం, ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం ప్రతినిధుల భాగస్వామ్యం సదస్సుకు మరింత ప్రాధాన్యత తీసుకురానుంది.

400 సమావేశాలు.. పెట్టుబడులకు వేదికలు

పెట్టుబడుల ఆకర్షణలో మాటలకే పరిమితం కాకుండా వ్యాపార సంబంధాలను కార్యరూపంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. సుమారు 400 బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) సమావేశాలు నిర్వహించనున్నారు. పరిశ్రమల ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల మధ్య నేరుగా చర్చలు జరిపేందుకు బిజినెస్ టు గవర్నమెంట్ (బీ2జీ) సమావేశాలనూ ఏర్పాటు చేస్తున్నారు. దీంతో రాష్ట్రంలోని పరిశ్రమలకు అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానం పెరగడమే కాకుండా, విదేశీ సంస్థలతో సాంకేతిక భాగస్వామ్యాలు, ఉత్పత్తుల ఎగుమతులు, పెట్టుబడుల అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) ప్రపంచ వ్యాపార రంగంలో కొత్త పరిచయాలు ఏర్పడేలా ఈ వేదికను వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆరు రంగాలు.. భవిష్యత్తుకు దిశానిర్దేశం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని ఆరు ప్రధాన అంశాలపై సదస్సులో ప్రత్యేక చర్చలు నిర్వహించనున్నారు.

వాణిజ్యం – పెట్టుబడులు – గ్లోబల్ వాల్యూ చైన్స్: అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, ప్రపంచ సరఫరా వ్యవస్థల్లో ఏపీ పరిశ్రమలకు అవకాశాలపై చర్చించనున్నారు.ట్రస్ట్ – జియో ఎకనమిక్స్ – గ్లోబల్ కోఆపరేషన్: దేశాల మధ్య ఆర్థిక సంబంధాలు, పరస్పర విశ్వాసం, అంతర్జాతీయ వాణిజ్య సహకారంపై మేధోమథనం జరగనుంది.వ్యవసాయం – ఆహార భద్రత – బయో ఎకానమీ: వ్యవసాయ ఆధునికీకరణ, ఆహార శుద్ధి పరిశ్రమలు, జీవ ఆధారిత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారించనున్నారు.ప్రతిభ – నైపుణ్యాలు – అంతర్జాతీయ ఉపాధి: యువతకు నైపుణ్య శిక్షణ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా మానవ వనరుల తయారీ, విదేశీ ఉద్యోగ అవకాశాలపై చర్చలు జరగనున్నాయి.సాంకేతికత – ఆవిష్కరణలు – భవిష్యత్ పరిశ్రమలు: సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీ, ఆధునిక తయారీ రంగాలు, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు.స్వచ్ఛ ఇంధనం – సుస్థిర వృద్ధి: పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ ఎనర్జీ, పర్యావరణహిత పారిశ్రామిక అభివృద్ధిలో పెట్టుబడుల అవకాశాలను అన్వేషించనున్నారు.

పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కల్పించాలి

సదస్సు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం అమరావతిలోని క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీతో పాటు అధికారులతో సమావేశమై సదస్సు నిర్వహణ, చర్చనీయాంశాలు, ప్రతిపాదిత డిక్లరేషన్లపై సమీక్షించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. ప్రపంచ మార్కెట్లతో రాష్ట్ర పరిశ్రమలను అనుసంధానించడమే సదస్సు ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఎంఎస్ఎంఈలకు అంతర్జాతీయ వ్యాపార అవకాశాలు కల్పించాలని, యువత నైపుణ్యాలకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశ్రమలకు సాంకేతిక సహకారం అందించే దిశగా చర్చలు సాగాలని పేర్కొన్నారు.

పారిశ్రామిక రాయితీల చెల్లింపులకు ఎస్క్రో అకౌంట్ విధానం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి సంస్కరణలను అంతర్జాతీయ పెట్టుబడిదారులకు వివరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రీన్ ఎనర్జీ, సెమీకండక్టర్లు, ఆధునిక సాంకేతిక రంగాల్లో రాష్ట్రానికి ఉన్న అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తలకు విస్తృతంగా పరిచయం చేయాలని చెప్పారు.

విధానాలే పెట్టుబడులకు భరోసా

పెట్టుబడుల ఆకర్షణకు కేవలం భూములు, రాయితీలు సరిపోవని.. సమర్థమైన పాలన, వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు కీలకమని ప్రభుత్వం భావిస్తోంది. అత్యుత్తమ విధానాలు, సమర్థులైన నిపుణులు, నాలెడ్జ్, మౌలిక సదుపాయాలు, బలమైన నాయకత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న ప్రధాన బలాలని చంద్రబాబు పేర్కొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడం సురక్షితం.. సులభతరం.. లాభదాయకం అనే నమ్మకాన్ని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల్లో కల్పించాలని సూచించారు. సదస్సు కేవలం చర్చలకే పరిమితం కాకుండా పెట్టుబడులు, వ్యాపార ఒప్పందాలు, సాంకేతిక భాగస్వామ్యాల రూపంలో స్పష్టమైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

విశాఖ నుంచి కొత్త పారిశ్రామిక శకం

ఒకప్పుడు విశాఖ అంటే ప్రకృతి అందాలు, సముద్ర తీరం, పర్యాటక ప్రాంతాలే గుర్తుకొచ్చేవి. ఇప్పుడు అంతర్జాతీయ పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, ఆధునిక సాంకేతికతకు కేంద్రంగా నిలిపేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. పోర్టులు, రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, నైపుణ్యం కలిగిన యువత వంటి అంశాలను పెట్టుబడిదారులకు వివరించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. భారీ పరిశ్రమల నుంచి చిన్నతరహా సంస్థల వరకు.. సంప్రదాయ వ్యాపారాల నుంచి అత్యాధునిక సాంకేతిక రంగాల వరకు అన్ని రంగాలకు అంతర్జాతీయ అవకాశాల ద్వారాలు తెరవడమే ఈ సదస్సు వెనుక ఉన్న ప్రధాన ఆలోచన. 59 దేశాల ప్రతినిధులు వందలాది వ్యాపార సమావేశాలు ప్రపంచస్థాయి పారిశ్రామిక దిగ్గజాల భాగస్వామ్యం ఇవన్నీ విశాఖ వేదికగా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త అవకాశాలను తెచ్చిపెట్టనున్నాయి. అయితే ఈ సదస్సు అసలైన విజయం కుదిరే ఒప్పందాల సంఖ్యలోనే కాదు అవి ఎంత త్వరగా కార్యరూపం దాల్చి రాష్ట్రంలో పరిశ్రమలుగా, యువతకు ఉద్యోగాలుగా, ప్రజలకు ఆర్థిక అవకాశాలుగా మారతాయన్న దానిపైనే ఆధారపడి ఉంటుంది.

మూడు రోజుల వ్యాపారానికీ జీఎస్టీ

- దీపావళి వ్యాపారులను హడలెత్తిస్తున్న లైసెన్సుల ఫీజులు - సాధారణ అనుమతులతోపాటు కొత్తగా జీఎస్టీ వసూళ్లు

- చిన్నపాటి షాపుపైనా రూ.15 వేల నుంచి 20 వేల వరకు భారం - అంతిమంగా సామాన్యులపై ధరల ప్రభావం



హైదరాబాద్ దీపావళి కాంతుల సంగతేమో కానీ.. అధికారుల మామూళ్లు, లైసెన్సుల ఫీజులతో పాటు ఈసారి కొత్తగా జీఎస్టీ వసూళ్లు తమకు చుక్కలు చూపెడుతున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. గతంతో పోల్చితే ఈసారి అన్ని ఫీజులూ అధికం కావడంతో అసలు దుకాణం పెట్టాలా.. వద్దా.. అని చాలామంది ఆలోచిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో సుమారు 30-40 మంది హోల్‌సేల్ వ్యాపారులున్నారు. వీరి ద్వారా కేవలం 20 శాతం మాత్రమే వ్యాపారం జరుగుతుండగా, మిగిలిన 80 శాతం అసంఘటిత రంగంలోని రిటైల్ వ్యాపారుల ద్వారా లేదంటే ఆన్‌లైన్‌లో జరుగుతుంటాయి.పెరిగిన ధరలు..: గతంలో బాణాసంచా కొనుగోలుకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు ఖర్చు చేసిన వినియోగదారులు ఇప్పుడు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకే కొనుగోళ్లను పరిమితం చేస్తున్నారని హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు. పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంఘర్షణ కారణంగా సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడడంతో పాటు రసాయనాలు, ముడి పదార్థాల ధరలు పెరిగాయని, దానితో టపాసుల ఉత్పత్తి ఖర్చులు కూడా పెరిగాయని పేర్కొంటున్నారు. భద్రతా ఉల్లంఘనలు జరుగుతున్నాయంటూ టపాసుల ఫ్యాక్టరీలను ఎక్కువ కాలం మూసి ఉంచడం తో ఉత్పత్తి కూడా తగ్గిందని శివకాశీ వ్యాపారులు చెబుతున్నారని వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈసారి టపాసుల ఉత్పత్తి వ్యయం 30 శాతానికి పైగానే పెరిగిందని, అయితే ఆ భారం మొత్తం కొనుగోలుదారులపై వేయకుండా తాము కూడా కొంత భరిస్తున్నామని చెబుతున్నారు. రిటైల్ ధరలను పెంచకూడదని ఆల్ ఇండియా ఫైర్‌వర్క్స్ అసోసియేషన్ నిర్ణయించింది కానీ, మొత్తం భారం తమపై వేసుకుని వ్యాపారం చేయడం అసాధ్యమని వాపోతున్నారు.కొత్తగా జీఎ?సటీ ఫీజు భారం: సాధారణంగా దీపావళి బాంబుల దుకాణం పెట్టాలంటే పలు శాఖల నుంచి అనుమతులు తీసుకోవాలి. మొదటగా అగ్నిమాపక శాఖ పర్మిషన్, తర్వాత మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్, పోలీస్ శాఖల నుంచి తీసుకోవాలి. ఈసారి కొత్తగా జీఎ?సటీ నిబంధనలు జత కలిశాయి. ఆయా శాఖల అనుమతుల కోసం ఒక్కో దుకాణానికి లైసెన్సింగ్ ఫీజులు రూ.20 వేల నుంచి రూ.25 వేలు అవుతుండగా.. కొత్తగా తీసుకొచ్చిన జీఎ?సటీ ఫీజు సుమారుగా రూ.15వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నట్లు పలువురు వాపోతున్నారు.మూడు రోజుల వ్యాపారానికి జీఎస్టీ ఏంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటన్నింటికి తోడు 'మామూళ్లు' కూడా ఉంటాయని, ఒక దుకాణం ఏర్పాటుకు మొత్తం కలుపుకుంటే రూ. 60 వేల నుంచి రూ.70 వేలు ఖర్చు వస్తుందని, ఇక షెడ్డు, సెక్యూరిటీ, అద్దెలు, తదితరాలు వేసుకుంటే రూ.1.50 లక్షల వరకు అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

150 పల్లెల్లో నీటి కోసం కటకట..

కాకినాడ : చుట్టూ చీకటి.. బయట ప్రపంచంతో సంబంధాలు లేవు.. తాగడానికి నీళ్లు లేవు.. చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉన్నా ప్రయోజనం లేదు. ఎందుకంటే అందులో ఛార్జింగ్ లేదు. గత మూడు రోజులుగా ఏపీలోని 150 గ్రామాల్లో పరిస్థితి ఇది. కరెంట్ లేక.. తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్నారు. ప్రకాశం జిల్లాలో మురసు తుఫాన్ మిగిల్చిన విషాదం ఇది.తుఫాన్ తీరం దాటినా... అది సృష్టించిన ప్రళయం నుంచి జిల్లా ప్రజలు ఇంకా కోలుకోలేకపోతున్నారు. కొత్తపట్నం, నాగులుప్పాడు పరిసర ప్రాంతాల్లో గంటకు ఏకంగా 140 కిలో మీటర్ల వేగంతో వీచిన ఈదురు గాలులకు ఊళ్లకు ఊళ్లే అంధకారంలో పడిపోయాయి.తుఫాన్ ప్రభావం కారణంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం 776 గ్రామాల్లో కరెంట్ నిలిచిపోయింది. దీంతో నాగులుప్పలపాడు, కొత్తపట్నం మండలాల్లోకి 150కి పైగా గ్రామాలు మూడు రోజులుగా చీకటిలోనే మగ్గుతున్నాయి. కరెంట్ లేకపోవడంతో మోటార్లు లేక తాగునీటి సరఫరా ఆగిపోయింది.

దీంతో ప్రజలు చుక్క నీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. తుఫాన్ గాలులకు జిల్లా విద్యుత్ వ్యవస్థ పూర్తిగా నాశనమైంది. ఏకంగా 2 వేల 500 కరెంట్ స్తంభాలు నేలకొరిగాయి. వందలాది ట్రాన్స్ ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నాగులుప్పలపాడు మండలంలో ఐదు సబ్ స్టేషన్లతో పాటు మొత్తం 16 సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రధాన లైన్లు తెగిలిపోయాయి. ఈ స్థాయిలో కరెంట్ కష్టాలు వచ్చాయి.కరెంట్ లేకపోవడంతో గ్రామాల్లో నివసిస్తున్న వారి దగ్గర మొబైల్ ఫోన్లు పూర్తిగా ఆగిపోయాయి. మొబైల్ సర్వీస్ ప్రొవైడర్లు పగటిపూట కనీసం జనరేటర్లు కూడా వినియోగించలేదు. దీంతో మొబైల్ సిగ్నల్స్, ఇంటర్నెట్ సేవలు కూడా నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు బయటి ప్రపంచంతో దాదాపుగా పూర్తిగా సంబంధాలు కట్ అయిపోయాయి. అయితే దీంతో కొత్తపట్నం మండల కేంద్రంలో జనరేటర్లు ఏర్పాటు చేసి, మొబైల్ చార్జింగ్ పెట్టినందుకు అక్షరాలా రూ.50 వసూలు చేస్తున్నారు. అవసరం కొద్దీ జనం కూడా అలాగే డబ్బులిచ్చి తమ ఫోన్లకు ఛార్జింగ్ చేసుకుంటున్నారుఆ గ్రామాల్లో కరెంట్ కష్టాలను తీర్చేందుకు విద్యుత్ శాఖ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి దాదాపు 700 మంది సిబ్బందిని ప్రకాశం జిల్లాకు రప్పించడం జరిగింది. గురువారం సాయంత్రానికి 30 సెక్షన్లలో కరెంట్ పునరుద్ధరించారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తుండగా.. సీపీడీసీఎల్ సీజీఎం సుబ్బారావు స్వయంగా నాగులుప్పలపాడులో పనులను పర్యవేక్షిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యుగంధర్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



వనపర్తి పెద్ద మునగల్ చెడు గ్రామానికి చెందిన యుగంధర్ రెడ్డి కొత్తకోటకు బైక్ పై వెళుతుండగా వెల్టూరు స్టేజ్ దగ్గర గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో యుగంధర్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు.విషయం తెలియగానే మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి వెంటనే స్పందించి బాధితుడిని వనపర్తి హైందవ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం, అనంతరం హైదరాబాద్ సిటీ న్యూరో హాస్పిటల్ కు స్వయంగా దగ్గరుండి మాజీ మంత్రి పంపించారు. ఈ కార్యక్రమంలో, నాయకులు రాజ ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, సయ్యద్ జమీల్, ఫజల్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు దివాళీ వెలుగులు

ఖమ్మం : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఆరు గ్యారెంటీల్లో ప్రధానమైన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై క్షేత్రస్థాయిలో ఉన్న ప్రచార లోపాన్ని అధిగమించేందుకు రేవంత్ రెడ్డి మంత్రివర్గం సరికొత్త రాజకీయ వ్యూహాన్ని తెరపైకి తెచ్చింది. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి పేరుతో ఒక వినూత్న ప్రజా సంబంధాల కార్యక్రమాన్ని నిర్వహించాలని క్యాబినెట్ అధికారికంగా నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే ఏకంగా 2.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, పండుగ వేళ ఆ ఇళ్లన్నింటిలో ప్రభుత్వం తరపున వేడుకలు జరపాలని నిర్ణయించడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో కలిసి పండుగ జరుపుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించాలన్నది సర్కారు ప్రధాన ఉద్దేశం.వాస్తవానికి రేవంత్ సర్కారు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాల్లో తీవ్రమైన పబ్లిసిటీ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలు, ప్రజాక్షేత్రంలో ఉన్న భావనలు ప్రభుత్వాన్ని కొంత డిఫెన్స్‌లోకి నెట్టాయి. అసలు రాష్ట్రంలో ఒక్క పేదవాడికైనా ఇల్లు మంజూరైందా, లబ్ధిదారుల ఖాతాల్లోకి నయాపైస అయినా జమ అయిందా అన్న సందేహాలు సామాన్య ప్రజల్లో కూడా బలంగా నాటుకుపోయాయి. క్షేత్రస్థాయిలో వేలాది మంది నిర్మాణాలు చేపట్టి బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్న విపక్షాల ప్రచారం హోరెత్తుతుండగా.. ప్రభుత్వం తమ శాఖాపరమైన ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో దారుణంగా విఫలమైందన్న విమర్శలు సొంత పార్టీ నేతల నుంచే వినిపించాయి.ఎవరికీ తెలియకుండానే నిశ్శబ్దంగా దాదాపు 2.25 లక్షల ఇళ్లను పూర్తి స్థాయి నిర్మాణానికి తీసుకువచ్చామని ప్రభుత్వం ఇప్పుడు అధికారిక గణాంకాలతో ముందుకొచ్చింది. కానీ ఎంత పని చేసినా దాన్ని మార్కెటింగ్ చేసుకోలేకపోతే రాజకీయంగా శూన్యమే మిగులుతుందన్న చేదు నిజాన్ని ఆలస్యంగానైనా గ్రహించిన క్యాబినెట్.. ఈ దీపావళి పండుగను తమ విజయాలను ప్రదర్శించే వేదికగా మార్చుకోవాలని నిర్ణయించింది. ఇళ్ల నిర్మాణాలు పూర్తికాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన మాట తప్పిందని చేస్తున్న ప్రచారానికి చెక్ పెట్టాలంటే.. పూర్తయిన రెండున్నర లక్షల ఇళ్ల ముంగిట స్వయంగా దీపాలు వెలిగించి చూపించడమే సరైన సమాధానమని పాలక వర్గం భావిస్తోంది. పండుగ సంబరాల ముసుగులో విపక్షాల నోళ్లు మూయించేందుకు ఇదొక వ్యూహాత్మక అస్త్రంగా మారింది. ప్రచార నిర్వహణలో విఫలమైన మాట వాస్తవమే అయినప్పటికీ, క్షేత్రస్థాయిలో సాధించిన ఈ భారీ ఫలితాన్ని దీపావళి వేడుకల ద్వారా ప్రజల దృష్టికి తేవాలన్న ఆలోచన కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా కలిసివచ్చే అవకాశాలున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా లబ్ధిదారుల గుమ్మంలో అడుగుపెట్టి వారితో మమేకమైతే.. ఆ దృశ్యాలు గ్రామీణ ప్రాంతాల్లో పథకం ఉనికిని, ప్రభుత్వ పనితీరును బలంగా చాటిచెబుతాయి. కేవలం పత్రికా ప్రకటనలకే పరిమితం కాకుండా, లబ్ధిదారుల ముఖాల్లోని సంతోషాన్ని ప్రత్యక్షంగా ప్రజలకు చూపించడం ద్వారా ఇప్పటివరకు ఉన్న అపోహలను తుడిచిపెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ అడుగు క్షేత్రస్థాయిలో ఏ మేరకు మైలేజ్ తెచ్చిపెడుతుందో వేచి చూడాలి

టీ పీసీసీ కంట్రోల్ చేయలేకపోతోందా?

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అయినా అధికార పక్షంలో క్రమశిక్షణ అనేది ఒక పెద్ద జోక్‌గా మారిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. విపక్షాలను దెబ్బతీయడం దేవుడెరుగు, సొంత ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలే బహిరంగ వేదికలపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను, ప్రభుత్వ విధానాలను ఎండగడుతుంటే టీపీసీసీ నాయకత్వం చేష్టలుడిగి చూస్తోంది. జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు నేరుగా ముఖ్యమంత్రి వైఖరిపైనే కామెంట్లు చేస్తుంటే, జిల్లాల స్థాయి నేతల మధ్య గొడవలు రోడ్డెక్కుతున్నాయి. ప్రభుత్వం నడుపుతున్న వేళ ఈ స్థాయిలో అంతర్గత విభేదాలు రచ్చకెక్కడం పార్టీ క్యాడర్‌లో తీవ్ర నిరాశను నింపుతోంది.మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి పార్టీలో నిధులతో పాటు పదవుల విషయంలో పాతకాపులకు విలువేదీ, కొత్తగా వచ్చిన వారికే పదవులు దక్కుతున్నాయి అంటూ చేసిన సంచలన వ్యాఖ్యలు గాంధీభవన్‌లో పెద్ద ప్రకంపనలే సృష్టించాయి. దానికి తోడు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఏకంగా సీనియర్ల వ్యాఖ్యలకు మద్దతు తెలపడమే కాకుండా, తన నియోజకవర్గానికి నిధులు ఇవ్వకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని సొంత ప్రభుత్వంపైనే తిరుగుబాటా తరహా హెచ్చరికలు జారీ చేశారు. వీరికి తోడుగా ఇతర ప్రజాప్రతినిధులు కూడా అసెంబ్లీ లోపలా, బయటా మంత్రులను, నిర్ణయాలను ప్రశ్నిస్తుండటంతో అధికార కాంగ్రెస్‌లో విపరీతమైన ఆధిపత్య పోరు సాగుతోందనేది స్పష్టమవుతోంది.జిల్లాలలో కూడా మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య ఆధిపత్య పోరు సరిహద్దులు దాటిపోతోంది. తాజాగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు మధ్య ఢిల్లీ హ్యాటల్ వేదికగా జరిగిన ఘర్షణ కాంగ్రెస్ శ్రేణులను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. నామినేటెడ్ పదవులు, జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక, ప్రాంతీయ ఆధిపత్యం విషయంలో వీరిద్దరి మధ్య మాటల యుద్ధం జరిగి, అది భౌతిక తీవ్రత స్థాయికి చేరుకుందన్న వార్తలు గాంధీభవన్‌ను ముంచెత్తాయి. ప్రగతి భవన్ లేదా గాంధీభవన్‌లో పరిష్కరించుకోవాల్సిన అంతర్గత విభేదాలను ఏకంగా హస్తిన వీధుల్లో రచ్చకెక్కించడం ద్వారా నేతలు పార్టీకి ఎంతటి పరాభవాన్ని మిగిల్చారో వేరే చెప్పక్కర్లేదు.ఈ విపరీత పరిణామాలకు ప్రధాన కారణం టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ , రాష్ట్ర నాయకత్వం పూర్తిగా వైఫల్యం చెందడమే. క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిన నాయకులపై కఠిన చర్యలు తీసుకోవడంలో పార్టీ సుముఖత చూపకపోవడం వల్లనే నేతలకు భయం లేకుండా పోయింది. గతంలో కొందరు చిన్న స్థాయి నేతలకు లేదా బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులకు నోటీసులు ఇచ్చిన కమిటీ, ఎంపీలు, బలమైన ఎమ్మెల్యేలు మరియు మంత్రుల విషయంలో మాత్రం మౌనం వహించడమో లేదా శోకాన్ని నటిస్తూ సమన్వయ కమిటీల పేరుతో కాలయాపన చేయడమో చేస్తోంది. ఈ ద్వంద్వ నీతి వల్లే క్రమశిక్షణ కమిటీ ఉనికి నవ్వులపాలవుతోంది. కాంగ్రెస్ పార్టీకి మొదటి నుంచీ ఉన్న తనదైన మార్క్ ప్రజాస్వామ్యం , ఢిల్లీ కల్చర్ కూడా ఈ రచ్చకు మరొక బలమైన కారణం. ఏ చిన్న సమస్య వచ్చినా స్థానిక నాయకత్వాన్ని దాటుకుని నేరుగా ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దల వద్దకు పంచాయితీ తీసుకెళ్లవచ్చనే ధీమా నేతల్లో ఉంది. అంతేకాకుండా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని ఓర్చుకోలేని కొందరు సీనియర్లు, సమయం దొరికినప్పుడల్లా ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు తమ వర్గం ఎమ్మెల్యేలను ఉసిగొల్పుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా ముఖ్యమంత్రితో పాటు టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ కూడా ఈ గ్రూపు రాజకీయాల ముందు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. అధికారంలో ఉన్న పార్టీకి ప్రజల్లో విశ్వసనీయత పెరగాలంటే సమర్థవంతమైన పాలన మాత్రమే సరిపోదు, బలమైన క్రమశిక్షణ కూడా అంతే అవసరం. క్రమశిక్షణను దాటి విమర్శలు గుప్పించే నేత ఎంతటి శక్తిమంతుడైనా సరే కఠినమైన చర్యలు తీసుకోకపోతే.. రాబోయే రోజుల్లో ఈ అంతర్గత విభేదాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద శాపంగా మారతాయి. విపక్షాలకు తమంతట తాముగా ఆయుధాలు అందిస్తున్న ఈ నేతల స్వేచ్ఛకు వెంటనే అడ్డుకట్ట వేయకపోతే, తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ పాత రాజకీయ రొంపిలోకి జారిపోక తప్పదన్న అభిప్రాయం వినిపిస్తోంది.

కూటమి వల్ల సీఈసీ తొలగింపు సాధ్యమేనా

న్యూఢిల్లీ : సీఈసీ అంటే కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్. ఇది రాజ్యాంగ బద్ధమైన పదవి. ఈపదవి నుంచి కేంద్రం కూడా.. జ్ఞానేశ్ కుమార్‌ని నేరుగా తొలగించలేదు. దీనికి రాజ్యాంగం సూచించిన విధంగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించే విధానం అవలంభించాలి. అంటే రాజ్యాంగ పరమైన అంశాలను పాటిస్తూ ముందుకెళ్లాలి. ఇంతకు అవేమిటంటే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం?లోక్‌సభలో తొలగింపు తీర్మానం ఆమోదం పొందాలి.రాజ్యసభలోనూ తీర్మానం ఆమోదం పొందాలి.నిరూపిత దుష్ప్రవర్తన లేదా అసమర్థత వంటి రాజ్యాంగపరమైన కారణాలు ఉండాలి.ప్రతి సభలో మొత్తం సభ్యుల మెజారిటీతో పాటు హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండొంతుల మద్దతు అవసరం.సీఈసీని తొలగించాలంటే ముందు విపక్షానికి అవసరమైన సంఖ్యా బలం కావాలి. ప్రస్తుతం విపక్ష ఇండియా కూటమికి ఉన్న బలం.. తీర్మానంప్రవేశపెట్టడానికి సంతకాలకు సరిపోతాయి. కానీ.. సీఈసీ ని నిజంగా తొలగించాలంటే రెండు సభల్లోనూ ప్రత్యేక మెజారిటీ సాధించాలి. అంతేకాదు..విచారణ కమిటీ ఆరోపణలను నిర్ధారించాలి.లోక్‌సభ, రాజ్యసభ రెండింటిలోనూ అవసరమైన మెజారిటీ రావాలి.ఆమోదం ఒకే పార్లమెంటు సమావేశంలో రావాలి.అందువల్ల ప్రతిపక్షానికి ఉన్న ఎంపీల సంఖ్య మాత్రమే కాకుండా, అధికార పక్షం లేదా ఇతర పార్టీల ఎంపీల మద్దతు కూడా కీలకం.ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని 2026 మార్చిలో ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ, రాజ్యసభల్లో నోటీసులు ఇచ్చారు.లోక్‌సభలో 130 మంది ఎంపీలు సంతకాలు చేశారు.రాజ్యసభలో 63 మంది ఎంపీలు సంతకాలు చేశారు.అయితే ఏప్రిల్ 6న లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ ఆ నోటీసులను స్వీకరించలేదు. ఎన్నికల సంఘం నిర్ణయాలపై పార్లమెంటులో చర్చకు ఒత్తిడి తీసుకు వచ్చే అవకాశం ఉంది.ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను ప్రజల ముందుంచడం..ఎన్నికల సంఘం పనితీరుపై న్యాయపరమైన పరిశీలన కోరడం, ఇదే సమయంలో ఇతర పార్టీల మద్దతు కోరడం చేయవచ్చు.లోక్‌సభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ సాధించాలి. రాజ్యసభ మొత్తం సభ్యుల్లో మెజారిటీ అదనపు మద్దతు అవసరం..ఆ తరువాత రాష్ట్రపతి తొలగింపు ఉత్తర్వు జారీ చేస్తారు.కేవలం రాజకీయ విభేదాలతో సీఈసీని తొలగించడం సాధ్యం కాదు.ఎన్నికల సంఘం నిర్ణయాలు సంస్థాగత ప్రక్రియలో భాగమని ఎన్నికల సంఘం పేర్కొంది.గత నోటీసుల్లో ఆరోపణలకు అవసరమైన ప్రాథమిక ఆధారాలు లేవని స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అభిప్రాయపడ్డారు.ఇండియా కూటమి సీఈసీ ని తొలగించాలంటే మూడు అడ్డంకులు దాటాలి.తొలగింపు నోటీసు ఆమోదం పొందాలి.ఆరోపణలు విచారణలో నిరూపించబడాలి.

తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవానికి

ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఈ నెల 11న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం.. పనుల పురోగతిని పరిశీలించిన పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, సుందరీకరణ, అభివృద్ధి పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ నెల 11వ



తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా చెరువు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి చెరువు పరిసరాల్లో జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రారంభోత్సవం నాటికి పనులు పూర్తయ్యేలా వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు.తమ్మిడికుంట చెరువు పరిధిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కుంచించుకుపోయిన చెరువు విస్తీర్ణాన్ని పరిరక్షించడంతో పాటు చెరువు కట్ట పటిష్టత, అలుగు మరమ్మతులు, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేక మళ్లింపు పైపులైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు.చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మాణం, వాకింగ్ ట్రాక్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. చెరువులోకి కలుషిత నీరు చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, తామర పూల పెంపకం ద్వారా చెరువును మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎక్కడా రాజీ పడకుండా ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. చెరువులను ఆక్రమణలు, కాలుష్యం నుంచి కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, తమ్మిడికుంటను సుందరమైన ఆహ్లాదకరమైన ప్రదేశంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని గాంధీ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని చెరువుల పరిరక్షణ, సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హైడ్రా అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల పాలిట రోతగ మారిన,నీటి బిల్లు వాత

- ఒడ్డు దాటాక హ్యాండ్ ఇచ్చిన సర్కార్ - హామీలిచ్చి హ్యాండ్ ఇస్తే, ఇక''హస్త''మయమే

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ప్రజలకు నీటి బకాయిలు లక్షల్లో,లడాయికి సిద్ధమౌతున్న సామాన్యులు.

- గతంలో సర్కార్ మేడలు వంచిన,సిఎం తో ''ఢీ''అంటే ''ఢీ''అన్న ఆర్మే

- తెలంగాణ ఉన్నత న్యాయస్థానం నుంచే న్యాయ పోరాటం చేసి మా హక్కులు చేజిక్కించుకున్న వైనం

కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని తాగునీటి సరఫరా వ్యవస్థకు దశాబ్దాల చరిత్ర ఉంది, బ్రిటిష్ కాలం నాటి రిజర్వాయర్లు ఉన్నాయి.అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కంటోన్మెంట్ ని ''బల్కు కన్స్యూమర్''గా జలమండలి భావించేది.ఈ నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసరాల్లో జలమండలి అధికారులు ఒక లీటర్ మంచి నీరుకి సుమారు ఆరు రూపాయలు కేటాయించింది.ఆదే సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకి మాత్రం బల్క్ కన్స్యూమర్ గా చూడడం స్థానిక ప్రజలకు భారంగా మారడంతో,పలువురు సర్కార్ కు పదే పదే వివరించినప్పటికి ప్రభుత్వం లో తీరు మారిపోవడంతో బోర్డు అధికారులకు జలమండలి కోట్లల్లో నీటి బిల్లులు పేరుకుపోయానని నోటిసులు జారీ చేసిన విషయం విదితమే.అయితే గత తెలంగాణ ప్రభుత్వం ''ఉచిత నీటి పథకం''అమల్లోకి తీసుకొచ్చింది.ఈ పథకం కంటోన్మెంట్ ప్రజలకు కూడా వర్తిస్తుందని పాలకులు చేప్పిన విషయం తెలిసిందే.ఇక అప్పటి నుంచి ఉచిత నీటి పథకం అమలులో ఎదురవుతున్న సాంకేతిక చిక్కులు కూడా అంతే స్థాయిలో ఉన్నాయి. 1806లో బ్రిటిష్ సైనిక శిబిరంగా ఏర్పడిన నుండి ఈ ప్రాంతంలో నీటి అవసరాలను స్థానిక బావులు,చెరువుల ద్వారా తీర్చేవారు,ఆ తర్వాత కాలంలో జనాభా పెరగడంతో 1900ల తొలినాళ్లలో క్రమబద్ధమైన పైప్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. శతాబ్దం పైగా సాగిన అభివృద్ధి అనంతరం, ఉస్మాన్ సాగర్,హిమాయత్ సాగర్ మొదలుకొని కృష్ణా, గోదావరి జలాల ఆధారంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ద్వారా కంటోన్మెంట్‌లోని 30 వేలకు పైగా కనెక్షన్లకు నీరు అందుతోంది.అయితే,జీహెచ్ఎంసీ తరహాలోనే కంటోన్మెంట్ వాసులకు కూడా ప్రయోజనం చేకూర్చేందుకు 2022 మార్చిలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి నెల 20వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని ప్రకటించింది.దీంతో దశాబ్దాలుగా చార్జీలు చెల్లిస్తున్న పౌరులకు ఊరట లభించినట్లయింది,కానీ ఈ ఉచిత నీటి పథకం అమలులోకి రావడానికి ప్రభుత్వం రెండు నిబంధనలను విధించింది. అందులో మొదటిది తాగునీటి కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం కాగా, రెండోది పని చేసే డిజిటల్ వాటర్ మీటర్లను అమర్చుకోవడం.

వాస్తవ పరిస్థితుల్లో కంటోన్మెంట్ పరిధిలోని ఎక్కువ శాతం ఇండ్లకు పని చేసే వాటర్ మీటర్లు లేకపోవడం,ఆన్‌లైన్ సీడింగ్ ప్రక్రియ సక్రమంగా పూర్తి కాకపోవడంతో పథకం అమలు కాగితాలకే పరిమితమైంది.దీనికి తోడు కేంద్ర రక్షణ శాఖ పరిధిలోని బోర్డు నిర్వహణ విధానాలు, వాటర్ బోర్డుకు కంటోన్మెంట్ చెల్లించాల్సిన బకాయిల వల్ల ఈ సమన్వయ లోపం మరింత తీవ్రమైంది. ఫలితంగా,క్షేత్రస్థాయిలో ఉచిత నీరు అందకపోగా, మీటర్లు లేని కారణంతో పౌరులకు యథావిధిగా నెలవారీ నీటి బిల్లులు జారీ అవుతూనే ఉన్నాయి. ఓవైపు జీహెచ్ఎంసీ ప్రజలకు ఉచిత నీరు అందుతుంటే, అదుగు దూరంలో ఉన్న కంటోన్మెంట్ ప్రజలపై మాత్రం బిల్లుల భారం పడటంతో స్థానిక ప్రజలు,వెల్ఫేర్ అసోసియేషన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.తమకు కూడా ఉపాధి,నివాస హక్కులతో పాటు సమాన సౌకర్యాలు కల్పించాలని, నిబంధనలను సవరించి 20 వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకాన్ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కంటోన్మెంట్ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



నీటి బిల్లు ఒక్క రూపాయి కూడా కట్టొద్దు ఆర్మే:

కంటోన్మెంట్ ప్రజలు నీటి బిల్లుల రూపంలో ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని మాజీ ఉపాధ్యక్షుడు రామకృష్ణ స్పష్టం చేశారు.నీటి బిల్లుల పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.ఈ మేరకు నిన్న తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో కంటోన్మెంట్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.

సీఎం రేవంత్ రెడ్డి,ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గతంలో ఇచ్చిన ఎన్నికల హామీలను వెంటనే గుర్తుచేసుకోవాలని హితవు పలికారు.ప్రజల పట్ల ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే,ఇచ్చిన మాట ప్రకారం ఉచిత తాగునీటి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.కంటోన్మెంట్ ప్రాంతంలో తాగునీటి సరఫరాను పెంచి,''ఎల్‌నినో'' పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై ఆయన సామెత ద్వారా మండిపడ్డారు.''ఓడ దాటేదాకా ఓడ మల్లన్న.. ఓడ దాటాక బోడ మల్లన్న!''లా ఆ పార్టీ వ్యవహారశైలి ఉందని ఎద్దేవా చేశారు.ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ప్రజల చుట్టూ తిరిగిన నాయకులు,గెలిచిన తర్వాత వారి సమస్యలను పట్టించుకోవడం లేదని ఘాటుగా విమర్శించారు.గతంలో బీజేపీ కార్యకర్తలు చేపట్టిన పోరాటాలు, ప్రజాందోళనల ఫలితంగానే కంటోన్మెంట్ ప్రాంతంలో ఉచిత తాగునీటి సౌకర్యం సాధ్యమైందని రామకృష్ణ గుర్తుచేశారు.ప్రస్తుతం ''ఎల్‌నినో'' ప్రభావం వల్ల నీటి ఎద్దడి ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో,ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.నీటి బిల్లులు వస్తాయని ఎవరు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

ఒకవేళ అధికారులు లేదా ప్రభుత్వం నీటి బిల్లుల పేరుతో ప్రజలను వేధింపులకు గురిచేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.ప్రజల పక్షాన అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని, కోర్టును ఆశ్రయించడానికైనా వెనుకాడబోమని రామకృష్ణ తెలిపారు.

చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక ''దీపావళి''



దీపావళి..అంటే దీపాల వరుస అని అర్థం. ఇంట్లోని ప్రతికూల శక్తులను తొలగించి నూతన వెలుగులు తీసుకువచ్చే గొప్ప పండుగ. హిందూమతంలో అత్యంత ముఖ్యమైన పండుగల్లో దీపావళి ఒక ముఖ్యమైన పండుగ. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా బాణసంచా కాల్చి దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకుంటారు. ఆరోగ్యం, సంతోషాన్ని కోరుకుంటు ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పర్వదినం. దీపావళి పండుగను ఆశ్వయుజ బహుళ అమవాస్య రోజున జరుపుకోనున్నారు. సనాతన ధర్మంలో ప్రతి పండుగ చెడు పై మంచి సాధించే విజయానికి ప్రతీక అయినప్పటికి, దీపావళి పండుగకు సంబంధించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ముఖ్యంగా రామాయణం, భారతం, భాగవతాలలో దీపావళి పండుగకు సంబంధించిన అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

రామాయణంతో దీపావళికి సంబంధించిన వృత్తాంతం

అయోధ్యకు రాజు అయిన దశరథుని కోరిక మేరకు శ్రీరాముడు, సీతాలక్ష్మణ సమేతుడై పద్నాలుగేళ్ళు అడవిలో నివసించేందుకు వెళతాడు. వనవాసం చేస్తుండగా లంకాధీశుడైన రావణాసురుడు సీతను ఎత్తుకు వెళతాడు. ఆ తర్వాత రావణసురునితో జరిపిన యుద్ధంలో విజయం పొందిన శ్రీరామచంద్రుడు సతీసమేతంగా అయోధ్యకు విచ్చేసిన ఆ రోజు అమావాస్య కావడంతో అయోధ్య అంతా చీకట్లు కమ్ముకుని ఉంటుంది. దీంతో శ్రీరామునికి స్వాగతం పలికేందుకు అయోధ్యావాసులు దీపాలను వెలిగించి అమావాస్య చీకట్లను పారద్రోలుతారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం దీపావళి పండుగను జరుపుకుంటుండటం విశేషం.

నరకాసుర సంహారం

ప్రాద్యోషపురానికి రాజు నరకాసురుడు. బ్రహ్మదేవుని నుంచి పొందిన వరగర్వంతో నరకాసురుడు దేవతలను మహర్షులను నానా ఇబ్బందులు పెడుతుంటాడు. నరకాసురుని ఆగడాలు శృతిమించడంతో సత్యభామ సమేతుడైన శ్రీకృష్ణుడు నరకాసురుని సంహరిస్తాడు. నరకాసురుని పీడ విరగడవ్వడంతో ప్రజలు దీపాలు వెలిగించి ఆనందోత్సాహాలతో పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఆ పరంపర నేటికీ కొనసాగుతుంది.

పాల సముద్రం నుంచి శ్రీమహాలక్ష్మిదేవి ఉద్భవించిన వృత్తాంతం

మరణాన్ని దరిచేరని అమృతం కోసం దేవదానవులు పాల సముద్రాన్ని చిలుకుతుండగా దీపావళి రోజున లక్ష్మిదేవి ఉద్భవించిందని పురాణాలు పేర్కొంటున్నాయి. సకల అష్టైశ్వర్యాలను ప్రసాదించే లక్ష్మీదేవికి దీపావళి నాటి సాయంత్రం ప్రత్యేక పూజలు చేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం.

మహాభారతంతో దీపావళి ప్రాచుర్యం

కౌరవులు సాగించిన మాయా జూదంలో ఓడిన పాండవులు పదమూడేళ్ళు వనవాసం ఒక సంవత్సర కాలం అజ్ఞాత వాసం సాగించిన అనంతరం కౌరవ పాండవుల మధ్య జరిగిన యుద్ధంలో విజయం సాధించి తమ రాజ్యానికి తిరిగి వచ్చిన సందర్భంలో ప్రజలు దీపాలు వెలిగించి వారికి స్వాగతం పలుకిన రోజే నేటి దీపావళి పండుగ అని ప్రజల విశ్వాసం.

దీపావళి సందేశం

పండుగలన్నీ ఏదో ఒకవిధంగా భగవంతుడైన శ్రీకృష్ణుడు లేదా శ్రీరామచంద్రునికి సంబంధించినవై ఉంటాయి. ఆ భగవత్సంబంధాన్ని తెలుసుకొని సరైన అవగాహనతో, భక్తి భావనతో ఈ పండుగలను జరుపుకొన్నప్పుడు వాటివల్ల ఎంతో ఆధ్యాత్మిక ప్రయోజనం కలుగుతుంది. తత్ఫలితంగా భగవంతుని లీలల్లో మనకు భాగమయ్యే భాగ్యం దక్కుతుంది. ఈ ఉత్సవాల్లోని అంతర్యాన్ని గ్రహిస్తే పండుగలన్ని పరమానంద భరితంగా మారుతాయి.

దీపావళి పండుగ శుభాకాంక్షలతో...



రవికుమార్ సంతోజు
బడంగ్‌పేట్, హైదరాబాద్

ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే గ్యాస్ సిలిండర్లతో వంటలు..

పక్కనే బాణసంచా దుకాణం

- ఫుట్‌పాత్‌పై విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు

- నేరేడ్‌మెట్‌లో ప్రజల ప్రాణాలతో చెలగాటం..?

భారీ ప్రమాదం జరిగాకే అధికారులు మేల్కొంటారా.?



మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్ ప్రాంతంలో ప్రజల భద్రత గాలిలో కలిసిపోతోంది. కృపా కాంప్లెక్స్ సమీపంలోని ఎస్ఎస్వీ రెసిడెన్సీ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై హోటల్ నిర్వహిస్తూ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పది అడుగుల లోపే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్లతో వంటలు చేస్తున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇంతటి ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనికి తోడు అదే హోటల్ పక్కనే బాణసంచా దుకాణం ఏర్పాటు చేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, మరోవైపు గ్యాస్ సిలిండర్లతో వంటలు, పక్కనే బాణసంచా నిల్వలు ఉంటే ఏ చిన్న నిప్పురవ్వ పడినా భారీ అగ్నిప్రమాదం సంభవించే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని అపార్ట్‌మెంట్లలో నివసించే మహిళలు, పిల్లలు, వృద్ధుల ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని వాపోతున్నారు.

విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలు..

ఇదే ప్రాంతంలో మరో ప్రమాదకరమైన సమస్య ప్రజలను కలవరపెడుతోంది. ఫుట్‌పాత్‌పై పెరిగిన చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతూ కనిపిస్తున్నాయి. గాలికి చెట్ల కొమ్మలు ఊగినా, విద్యుత్ తీగల మధ్య రాపిడి జరిగినా షార్ట్‌సర్క్యూట్‌తో పాటు ఇతర ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇంత స్పష్టంగా కనిపిస్తున్న సమస్యలను సైతం అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది.

ఫుట్‌పాత్‌లు వ్యాపారాల కోసమా.?

ప్రజలు నడిచేందుకు ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గ్యాస్ సిలిండర్లతో వంటలు చేయడం, పక్కనే బాణసంచా దుకాణం ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులకు అనుమతులు ఎవరు ఇచ్చారు.? భద్రతా నిబంధనలు పాటిస్తున్నారా.? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ప్రమాదం జరిగాక బాధ్యులెవరు.?

ఒకవేళ భారీ అగ్నిప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిది.? ప్రమాదం జరిగిన తర్వాత విచారణలు, పరామర్శలు చేయడం కంటే ముందుగానే అప్రమత్తమై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా.? అంటూ స్థానికులు నిలదీస్తున్నారు.జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, హైదరాబాద్ పోలీస్ శాఖ, తెలంగాణ అగ్నిమాపక శాఖ అధికారులు తక్షణమే సంయుక్త తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వ్యాపారాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గ్యాస్ సిలిండర్ల వినియోగం, బాణసంచా దుకాణం భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.నేరేడ్‌మెట్ ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడిన తర్వాత స్పందించడం కాదు. ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా సంబంధిత శాఖల నిర్లక్ష్యానికి ముగింపు పలికి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

అవుసులపల్లిలో పోలీసుల విస్తృత తనిఖీలు

- 75 వాహనాలు స్వాధీనం



మెదక్, నవంబర్ 7 నేరాల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అవుసులపల్లి గ్రామంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ సందర్భంగా సరైన వాహన పత్రాలు లేని 69 ద్విచక్ర వాహనాలు, రెండు బొలెరోలు, నాలుగు ఆటోలను కలిపి మొత్తం 75 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో భాగంగా నార్కోటిక్ డాగ్ జూబి సహాయంతో ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల ఉనికిని పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ డివైజ్‌తో వేలిముద్రలను సేకరించి పాత నేరస్థుల వివరాలను గుర్తించే ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీలు, బ్యాంకు ఖాతాల వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. చిన్న దూరమైనా హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, స్ట్రాప్ బిగించుకోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. 18 ఏళ్లలోపు బాలికతో ఆమె అంగీకారంతో శారీరక సంబంధం పెట్టుకున్నా పోక్సో చట్టం ప్రకారం నేరమేనని, నిందితులకు కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని, వారి భద్రత, నేరాల నియంత్రణ కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. గ్రామస్థులకు అందుబాటులో ఉండేందుకు వీఓపీ ఏఎస్ఐ విఠల్‌ను నియమించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తొట్టంబేడు జెడ్పీటీసీగా రావెళ్ల మునరాజ్ నాయుడు ఘన విజయం.



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి సమీపంలోని ఎస్కేఐటీ కళాశాల లెక్కింపు కేంద్రం వద్ద శనివారం వెల్లడైన జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో తొట్టంబేడు మండల జెడ్పీటీసీ స్థానాన్ని తెలుగుదేశం పార్టీ కూటమి అభ్యర్థి రావెళ్ల మునరాజ్ నాయుడు కైవసం చేసుకున్నారు. ఆయన 791 ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు.ఈ విజయంతో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు.ఫలితాలు వెలువడగానే ఆనందోత్సాహాలతో కార్యకర్తలు కేరింతలు కొడుతూ, విజేత రావెళ్ల మునరాజ్ నాయుడిని భుజాలపై ఎత్తుకుని అభినందించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. దీంతో ఎస్కేఐటీ కళాశాల ప్రాంగణం కూటమి శ్రేణుల జయజయధ్వానాలతో మార్మోగింది.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యుడు రావెళ్ల మునరాజ్ నాయుడు మాట్లాడుతూ, వైసీపీ గత ప్రభుత్వ పాలనకు తన విజయం ప్రజలు ఇచ్చిన తీర్పుకు నిదర్శనమని పేర్కొన్నారు. తన విజయాన్ని మాజీ మంత్రి, దివంగత నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి అంకితం ఇస్తున్నట్లు భావోద్వేగంగా తెలిపారు. తన గెలుపునకు సహకరించిన తొట్టంబేడు మండల ప్రజలకు, కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కూటమి నాయకులు,కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేసే నాయకులనే ప్రజలు ఆదరిస్తారని, తొట్టంబేడు మండల ప్రజలు తనకు పట్టం కట్టడం ఇందుకు నిదర్శనమని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తొట్టంబేడు మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని రావెళ్ల మునరాజ్ నాయుడు స్పష్టం చేశారు.

నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు విక్రయిస్తూ మోసాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) నకిలీ ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ ప్రజలను మోసం చేస్తున్న వ్యక్తిని రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.1267/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ కేసులో హైదరాబాద్‌లోని మలక్‌పేట్ సైదనగర్‌కు చెందిన అల్తమాష్ (26)ను నవంబర్ 7న పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు నకిలీ, క్లోన్ చేసిన ఐఫోన్లు, ఆపిల్ వాచీలు, ఇయర్‌బడ్స్‌ను అసలైనవిగా నమ్మించి విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.నిందితుడి వద్ద నుంచి రెండు ఐఫోన్లు, నాలుగు నకిలీ ఆపిల్ వాచీలు, స్మార్ట్ వాచీలు, ఏడు నకిలీ ఇయర్‌బడ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న రెండు ఫోన్లలో ఒకటి నకిలీ ఐఫోన్‌గా గుర్తించారు.ఈ మోసాలకు సంబంధించి ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌కు చెందిన ఆవేష్ ఖాన్ అనే మరో వ్యక్తి కూడా పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం అతను పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అరెస్టు చేసిన అల్తమాష్‌ను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.మాదాపూర్ ఏసీపీ మార్గదర్శకత్వంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ పర్యవేక్షణలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ కె. రామిరెడ్డి, క్రైమ్ సిబ్బంది ఈ కేసును ఛేదించారు. నిందితుడి అరెస్టులో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని మాదాపూర్ ఏసీపీ అభినందించారు.

హైదరాబాద్‌లో స్నేహం పేరుతో మోసం

- కిలోల కొద్దీ బంగారం, వెండి చోరీ
- స్నేహితురాలిని నమ్మించి ఆమె పిన్ని ఇంట్లో భారీ చోరీ
- నిందితుడు కాలేజీ వార్డెన్ చంద్రశేఖర్‌గా గుర్తింపు
- సుమారు అరకిలో బంగారం, మూడు కిలోల వెండి అపహరణ
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు...



హైదరాబాద్ బంగారం, నగదు స్వాధీనంస్నేహం పేరుతో నమ్మించి భారీ చోరీకి పాల్పడిన ఘటన నేరెడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. తన స్నేహితురాలి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న ఓ యువకుడు, ఆమె పిన్ని ఇంట్లో ఏకంగా అర కిలోకు పైగా బంగారం, మూడు కిలోల వెండి ఆభరణాలను అపహరించాడు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు, అతని నుంచి భారీగా బంగారం, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఒక కళాశాలలో వార్డెన్‌గా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు, అదే కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఆమె పిన్ని కుమారి మానే పద్మావతి ఇంట్లో పెద్ద మొత్తంలో బంగారం ఉన్నట్లు నిందితుడు గుర్తించాడు. తనకు అప్పులు ఉన్నాయని, బంగారం తాకట్టు పెట్టి తీర్చేసి తిరిగి ఇచ్చేస్తానని ఆ విద్యార్థినిని నమ్మించి, ఆమె వద్ద నుంచి ఇంటి తాళాలు సంపాదించాడు. గత అక్టోబరు 20న పద్మావతి తన ఇంటికి తాళం వేసి మార్కెట్‌కు వెళ్లిన సమయంలో చంద్రశేఖర్ ఈ చోరీకి తెగబడ్డాడు. ఇంట్లోని 556 గ్రాముల బంగారం, 2.9 కిలోల వెండి వస్తువులను దోచుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. బాధితురాలి సోదరి కుమార్తె ద్వారా చంద్రశేఖర్‌పై అనుమానం వ్యక్తమైంది. దీంతో సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు, నిందితుడిని తిరుమలగిరిలో అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల విచారణలో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు. అపహరించిన బంగారంలో కొంత భాగాన్ని గుంటూరు, చార్మినార్ ప్రాంతాల్లో విక్రయించి రూ.25 లక్షలు పొందినట్లు వెల్లడించాడు. నిందితుడి నుంచి 429 గ్రాముల బంగారం, రూ.25 లక్షల నగదు, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు మల్కాజిగిరి డీసీపీ శ్రీధర్ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి ఈ కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు.

కోదండరాముడి కొలువులో భక్తి వైభవం

- తిరుపతిలో రామయ్యకు.. శతాబ్దాల చరిత్ర సాక్ష్యం
- చోళుల కాలం నుంచి నేటి వరకు..
- సీతారాముల సన్నిధిలో ఆధ్యాత్మిక పరిమళం నిత్య కైంకర్యాలు
- వారోత్సవాలు.. మాస కల్యాణం.. బ్రహ్మోత్సవాల మహా సందడి
- ఎదురుగా రామచంద్ర పుష్కరిణి.. - తెప్పోత్సవాలతో కనువిందు

(తిరుపతి ఆధ్యాత్మిక ప్రత్యేక కథనం.. తోట వెంకట్ ప్రజాప్రశ్న బ్యూరో, ఆంధ్ర ప్రదేశ్)



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు తిరుపతి నగరం ఆధ్యాత్మిక ఆతిథ్యాన్ని అందిస్తుంది. ఆ నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటి శ్రీ కోదండరామస్వామి దేవస్థానం. కాలం మారినా.. రాజ్యాలు మారినా.. పాలకులు మారినా.. భక్తుల హృదయాల్లో శ్రీరాముడిపై ఉన్న విశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు. సీతమ్మవారు, లక్ష్మణస్వామివారితో కలిసి కొలువుదీరిన కోదండరాముడు నిత్యం భక్తులకు దర్శనమిస్తూ.. ధర్మం, న్యాయం, త్యాగం, ఆదర్శ జీవనానికి ప్రతీకగా నిలుస్తున్నాడు.తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో నిర్వహణలో ఉన్న ఈ ఆలయం కేవలం పూజా కార్యక్రమాలకు పరిమితమైన క్షేత్రం కాదు. శతాబ్దాల చరిత్ర, శిల్పకళా వైభవం, ఆగమ సంప్రదాయాలు, ఉత్సవాల పరంపర, పుష్కరిణి పవిత్రత కలగలిసిన ఆధ్యాత్మిక కేంద్రం. తిరుపతి నగరంలో శ్రీరామభక్తి పరిమళాన్ని విరజిమ్ముతున్న ఈ ఆలయం.. చారిత్రకంగా, ధార్మికంగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది.

చోళుల కాలం నుంచి.. చరిత్రకు సజీవ సాక్ష్యం..

శ్రీ కోదండరామస్వామి ఆలయానికి వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉన్నట్లు టీటీడీ అధికారిక ఆలయ సమాచారం పేర్కొంటోంది. క్రీ.శ. 10వ శతాబ్దంలో చోళ రాజుల కాలంలో ఈ ఆలయ నిర్మాణం జరిగినట్లు చారిత్రక వివరాలు తెలియజేస్తున్నాయి. అనంతర కాలంలో విజయనగర రాజులు ఈ ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ముఖ్యంగా 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయానికి మరింత వైభవం చేకూరినట్లు టీటీడీ చరిత్రలో వివరించింది.
ఆలయ ప్రాకారాల్లో కనిపించే విజయనగర రాజవంశానికి చెందిన చిహ్నాలు, రాజముద్రికలు గత వైభవాన్ని గుర్తుచేస్తాయి. రాతి మండపాలు, ఆలయ నిర్మాణ శైలి, శిల్పకళా రూపాలు నాటి కళాకారుల ప్రతిభకు అద్దం పడుతున్నాయి. ఆలయ చరిత్రలో 1430వ సంవత్సరానికి చెందిన శాసన ప్రస్తావన కూడా ఉంది. విజయనగర రాజు అచ్యుతరాయల శ్రేయస్సు కోసం సాతకోపదాస నరసింహరాయ ముదలియార్ ఈ ఆలయ నిర్మాణం, విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన కార్యాలను చేపట్టినట్లు టీటీడీ ప్రచురించిన చారిత్రక కథనం పేర్కొంటోంది. రాజుల కాలంలో ప్రారంభమైన ఈ ఆధ్యాత్మిక పరంపర నేటికీ కొనసాగుతోంది. చరిత్రను మోస్తున్న రాతి గోడలు.. భక్తుల ప్రార్థనలకు సాక్ష్యంగా నిలుస్తున్న గర్భాలయం.. తరతరాలుగా కొనసాగుతున్న పూజా సంప్రదాయాలు ఈ క్షేత్రానికి ప్రత్యేకతను తీసుకొస్తున్నాయి.

సీతారామ లక్ష్మణుల దివ్య దర్శనం..

ఆలయంలో ప్రధానంగా శ్రీ కోదండరామస్వామి, సీతమ్మవారు, లక్ష్మణస్వామివారు కొలువుదీరారు. శ్రీరాముడు చేతిలో కోదండం ధరించిన రూపంలో దర్శనమివ్వడం ఈ ఆలయానికి ప్రత్యేక ఆకర్షణ. ధర్మానికి ప్రతీకగా నిలిచే శ్రీరాముడి దివ్య రూపం.. పక్కనే సీతమ్మవారి కరుణామయ సన్నిధి.. సేవలో నిలిచే లక్ష్మణస్వామివారి భక్తి భావం.. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తాయి.ఇక్కడి ఉత్సవమూర్తులు కూడా భక్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించారు. పండుగలు, వాహన సేవలు, కల్యాణోత్సవాల సమయంలో సీతారామ లక్ష్మణులు ఆలయ ప్రాంగణం దాటి భక్తులకు దర్శనమిస్తారు. ఆ సమయంలో ఆలయ పరిసరాలు భక్తి గీతాలు, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటాయి. శ్రీరాముడి జీవితంలోని ఆదర్శాలు.. తండ్రి మాట నిలబెట్టుకోవడం, ధర్మాన్ని కాపాడడం, ప్రజల పట్ల బాధ్యత, కష్టకాలంలోనూ న్యాయాన్ని విడిచిపెట్టకపోవడం వంటి విలువలు ఈ ఆలయ దర్శనంతో భక్తులకు గుర్తుకొస్తాయి. అందుకే కోదండరామస్వామి సన్నిధి కేవలం కోరికలు కోరుకునే స్థలం మాత్రమే కాదు.. మనిషి తన జీవన విధానాన్ని ఆత్మపరిశీలన చేసుకునే పవిత్ర ప్రదేశంగా కూడా భావించబడుతోంది.

నిత్య కైంకర్యాల్లో ఆగమ సంప్రదాయం..

ఈ ఆలయంలో వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజా కైంకర్యాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారిక సమాచారం వెల్లడిస్తోంది. నిత్య పూజలు, అభిషేకాలు, అర్చనలు, ఉత్సవ సేవలు ఆలయ సంప్రదాయానికి అనుగుణంగా జరుగుతాయి. ప్రతి రోజు స్వామివారిని దర్శించుకునే భక్తులకు పూజా కార్యక్రమాలు ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తాయి.
నిత్య కైంకర్యాల్లో భాగంగా స్వామివారికి అర్చనలు, నైవేద్యాలు సమర్పిస్తారు. ప్రత్యేక పర్వదినాల్లో పూజా కార్యక్రమాలు మరింత వైభవంగా నిర్వహిస్తారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని కుటుంబ సౌఖ్యం, ఆరోగ్యం, శాంతి, సంతానం, సర్వమంగళం కోసం ప్రార్థిస్తారు.ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనం మాత్రమే కాకుండా.. స్వామివారి సేవల్లో పాల్గొనే అవకాశం కూడా ఉంటుంది. టీటీడీ నిర్ణయించిన విధానాల ప్రకారం అర్జిత సేవలు నిర్వహించబడతాయి. సేవల సమయాలు, టికెట్ల వివరాలు మారే అవకాశం ఉన్నందున భక్తులు ముందుగా టీటీడీ అధికారిక సమాచారం పరిశీలించడం అవసరం.

ప్రతి శనివారం.. అభిషేకం, తిరుచ్చి, ఊంజల్ సేవ..

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వారోత్సవాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రతి శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించడం సంప్రదాయంగా కొనసాగుతోంది. అభిషేకం అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. సాయంత్రం ఉత్సవమూర్తులను తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. తిరుచ్చి సేవలో స్వామివారు, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తూ ఆలయ వీధుల్లో విహరిస్తారు. అనంతరం ఊంజల్ సేవ నిర్వహించడం ఈ వారోత్సవాల్లో ముఖ్యమైన భాగం.ఊంజల్ సేవలో స్వామివారు, అమ్మవారిని ఉయ్యాలలో ఆసీనులను చేసి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భక్తి గీతాలు, మంగళ వాయిద్యాల మధ్య జరిగే ఈ సేవ భక్తులకు ప్రశాంతమైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది. వారాంతంలో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఈ సేవలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

పునర్వసు నక్షత్రం.. సీతారాముల కల్యాణ వైభవం..

శ్రీరాముడికి పునర్వసు నక్షత్రం ప్రత్యేక ప్రాధాన్యం కలిగినదిగా సంప్రదాయంలో భావిస్తారు. ఈ సందర్భంగా ప్రతి నెల పునర్వసు నక్షత్రం రోజున శ్రీ సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడం ఆలయ మాసోత్సవాల్లో ప్రధానమైనది.
కల్యాణోత్సవంలో సీతమ్మవారిని, శ్రీరామచంద్రుడిని దివ్య దంపతులుగా అలంకరించి పూజలు నిర్వహిస్తారు. వేద మంత్రాల నడుమ జరిగే కల్యాణ కార్యక్రమం భక్తులకు వైవాహిక జీవితం, కుటుంబ ఐక్యత, పరస్పర విశ్వాసం వంటి విలువలను గుర్తుచేస్తుంది.
కల్యాణం అనంతరం సాయంత్రం స్వామివారు, అమ్మవారు తిరుచ్చిపై ఆలయ మాడ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు ఊరేగింపుగా వెళ్తారు. అక్కడ ఊంజల్ సేవ నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. కల్యాణోత్సవం రోజున ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారుతాయి.

పౌర్ణమి.. కలశాభిషేకం.. పుష్కరిణి ఉత్సవం..

ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు అష్టోత్తర కలశాభిషేకం నిర్వహించడం మాసోత్సవాల్లో విశేషమైనది. కలశాల్లో పవిత్ర జలాలను సిద్ధం చేసి మంత్రోచ్ఛారణలతో అభిషేకం చేయడం ద్వారా స్వామివారికి ప్రత్యేక సేవ సమర్పిస్తారు.



పౌర్ణమి రోజున సాయంత్రం స్వామివారు, అమ్మవారు తిరుచ్చిపై ఆలయ వీధుల నుంచి శ్రీరామచంద్ర పుష్కరిణి వరకు ఊరేగింపుగా వెళ్తారు. పుష్కరిణి వద్ద జరిగే ఉత్సవం భక్తులకు మరో ఆధ్యాత్మిక అనుభూతిని అందిస్తుంది.
అమావాస్య రోజున స్వామివారి పుష్పాలంకరణ సేవకు కూడా ప్రాధాన్యం ఉంది. పూలతో అలంకరించిన స్వామివారి దివ్య రూపాన్ని దర్శించుకోవడానికి భక్తులు ఆసక్తి చూపుతారు. పుష్పాలంకరణలో స్వామివారి సౌందర్యం మరింత వైభవంగా కనిపిస్తుంది.

శ్రీరామచంద్ర పుష్కరిణి.. ఆలయానికి ఆధ్యాత్మిక ఆభరణం..

శ్రీ కోదండరామస్వామి ఆలయానికి ఎదురుగా ఉన్న శ్రీరామచంద్ర పుష్కరిణి ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణ. ఆలయ ఉత్సవాల్లో పుష్కరిణికి కీలక స్థానం ఉంది. పౌర్ణమి రోజున జరిగే ఊరేగింపులు, తెప్పోత్సవాలు ఈ పవిత్ర జలాశయంతో అనుబంధం కలిగి ఉంటాయి.
పుష్కరిణి అంటే కేవలం నీటి నిల్వ కాదు.. ఆలయ సంప్రదాయంలో పవిత్రతకు, ఆధ్యాత్మిక అనుబంధానికి ప్రతీక. ఆలయ ఉత్సవమూర్తులు పుష్కరిణి వద్దకు చేరుకోవడం.. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం.. భక్తులు స్వామివారిని దర్శించుకోవడం.. ఈ క్షేత్రానికి ప్రత్యేకమైన ఉత్సవ వైభవాన్ని తీసుకొస్తాయి.
చైత్ర మాసంలో పౌర్ణమి సందర్భంగా మూడు రోజుల పాటు తెప్పోత్సవాలు నిర్వహించే సంప్రదాయం ఉంది. పుష్కరిణిలో అలంకరించిన తెప్పపై స్వామివారు, అమ్మవారు విహరిస్తారు. నీటిపై వెలుగులు, పుష్పాలంకరణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల హరిభక్తి నినాదాల మధ్య జరిగే ఈ ఉత్సవం తిరుపతి ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తుంది.
పుష్కరిణి చుట్టూ భక్తులు చేరి స్వామివారి తెప్పోత్సవాన్ని తిలకిస్తారు. ఈ సమయంలో ఆలయ పరిసరాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటాయి. తెప్పోత్సవం భక్తులకు శ్రీరాముడి సన్నిధిలో ఆనందాన్ని, ప్రశాంతతను అందించే ప్రత్యేక కార్యక్రమంగా కొనసాగుతోంది.

బ్రహ్మోత్సవాలు.. తొమ్మిది రోజుల ఆధ్యాత్మిక సందడి..

శ్రీ కోదండరామస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత ప్రధానమైన పర్వదినాలు. సాధారణంగా ఫాల్గుణ మాసంలో తొమ్మిది రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. అంకురార్పణతో ప్రారంభమయ్యే ఉత్సవాలు ధ్వజారోహణం, వివిధ వాహన సేవలు, రథోత్సవం, చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగుస్తాయి.బ్రహ్మోత్సవాల్లో స్వామివారు వివిధ వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. శేషవాహనం, హంసవాహనం, సింహవాహనం, ముత్యాల పందిరి, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, గరుడవాహనం, హనుమంత వాహనం, గజవాహనం, సూర్యప్రభ, చంద్రప్రభ వంటి సేవలు ఉత్సవ వైభవాన్ని పెంచుతాయి.వాహన సేవల్లో ప్రతి రూపానికి ప్రత్యేక ఆధ్యాత్మిక భావం ఉంటుంది. హనుమంత వాహనంపై స్వామివారి దర్శనం భక్తులకు సేవాభావాన్ని గుర్తుచేస్తుంది. గరుడ వాహనం వైష్ణవ సంప్రదాయంలో ప్రత్యేకమైనది. సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాలు విశ్వ చైతన్యాన్ని సూచించేలా భక్తులు భావిస్తారు.
బ్రహ్మోత్సవాల్లో రథోత్సవం ప్రత్యేక ఆకర్షణ. అలంకరించిన రథంపై స్వామివారు ఆలయ వీధుల్లో విహరిస్తారు. భక్తులు రథాన్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. చివరి రోజున చక్రస్నానం, ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి. ఈ తొమ్మిది రోజుల వేడుకలు తిరుపతి నగరంలో శ్రీరామభక్తి వైభవాన్ని చాటుతాయి.

ధర్మానికి ప్రతీక.. భక్తులకు నమ్మకపు నిలయం..

శ్రీ కోదండరామస్వామి ఆలయం చరిత్ర, ఆగమ సంప్రదాయం, విగ్రహ వైశిష్ట్యం, పుష్కరిణి, ఉత్సవాల పరంపరతో తిరుపతి ఆధ్యాత్మిక పటంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. చోళుల కాలంలో ప్రారంభమైన ఆలయ చరిత్ర.. విజయనగర రాజుల కాలంలో అభివృద్ధి.. నేటి టీటీడీ నిర్వహణలో కొనసాగుతున్న నిత్య కైంకర్యాలు.. ఈ క్షేత్రం యొక్క నిరంతర ఆధ్యాత్మిక ప్రయాణాన్ని తెలియజేస్తున్నాయి.
సీతారాముల దర్శనం కోసం వచ్చే భక్తులకు ఈ ఆలయం ప్రశాంతతను అందిస్తుంది. పండుగ రోజుల్లో ఉత్సవాల వైభవం.. సాధారణ రోజుల్లో నిత్య పూజల పవిత్రత.. ద
పుష్కరిణి వద్ద జరిగే ప్రత్యేక సేవలు.. ఇవన్నీ కలిపి కోదండరామస్వామి ఆలయాన్ని భక్తి, చరిత్ర, సంప్రదాయాల సంగమంగా నిలబెడుతున్నాయి.
తిరుపతి నగరానికి వచ్చే భక్తులు శ్రీ కోదండరామస్వామివారి దర్శనంతో పాటు ఆలయ చరిత్రను తెలుసుకోవడం, ఉత్సవాల సంప్రదాయాన్ని అనుభవించడం ద్వారా ఈ పురాతన క్షేత్రం యొక్క ఆధ్యాత్మిక విశిష్టతను మరింతగా అర్థం చేసుకోవచ్చు.
శతాబ్దాల చరిత్ర.. సీతారాముల దివ్య సన్నిధి.. పుష్కరిణి పవిత్రత.. ఉత్సవాల వైభవం.. ఇవన్నీ కలిసిన తిరుపతి శ్రీ కోదండరామస్వామి ఆలయం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే రామభక్తి క్షేత్రం.

'కౌరిబురి: ది కర్స్ డ్ టెంపుల్' (నెట్ ఫ్లిక్స్) సిరీస్ రివ్యూ!



ఈ మధ్య కాలంలో బెంగాలీ సిరీస్ ల జోరు పెరుగుతోంది. ఓటీటీ ప్రేక్షకుల హృదయాలలో బెంగాలీ సిరీస్ లు తమ ప్రత్యేకతను చాటుతూ వెళుతున్నాయి. అలా తెలుగు ఆడియోతోను ఓటీటీ ఆడియన్స్ ముందుకు వచ్చిన మరో సిరీస్ గా 'కౌరిబురి: ది కర్స్ డ్ టెంపుల్' కనిపిస్తుంది. సయంతన్ ఘోషల్ దర్శకత్వం వహించిన ఈ సిరీస్, 6 ఎపిసోడ్స్ గా రూపొందింది. ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సిరీస్ 'నెట్ ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ అవుతోంది. భవతారణ్ ముఖర్జీ (జీతూ కమల్) తన తండ్రి నుంచి జ్యోతిష్యంతో పాటు కొన్ని మంత్రశక్తులను పొందుతాడు. జరగబోయే సంఘటనలు కొన్ని అతనికి ముందుగానే తెలుస్తుంటాయి. అస్సాంలో అడవి ప్రాంతానికి దగ్గరలో ఉంటున్న 'మాధురి' కుటుంబం గురించి అతనికి తండ్రి చెబుతాడు. మాధురి (సోలంకీ రాయ్) ఆపదలో ఉందనీ, వెళ్లి కాపాడమని అంటాడు. ఒకప్పుడు మాధురి కుటుంబం భవతారణ్ ఇంటి పక్కనే ఉండేవారు. ఆ తరువాత వాళ్లు ఆ ఊరునుంచి వెళ్లిపోతారు. అప్పట్లోనే భవతారణ్ – మాధురి ఒకరిపట్ల ఒకరు ఆకర్షితులవుతారు. తండ్రి మాట ప్రకారం భవతారణ్ అస్సాం అటవీ ప్రాంతంలోని మాధురి ఇంటికి చేరుకుంటాడు. మధురినీ చూడగానే, ఆమె ఒక దుష్ట శక్తిచేత పీడించబడుతోందనే విషయం అతనికి అర్థమవుతుంది. ఆమెకి 'అనీర్ బన్'తో వివాహం జరిగిందనీ, అతను ఏమైపోయాడనేది తెలియడం లేదని మాధురీ తల్లిదండ్రులు భవతారణ్ తో చెబుతారు. ఆ అడవి కూడా అనేక రహస్యాలతో కూడినదిగా భవతారణ్ కి అనిపిస్తుంది. అదే సమయంలో అతనికి 'పరాఖ్' అనే వ్యక్తి తారసపడతాడు. భవతారణ్ ని ఒక వృద్ధుడి దగ్గరికి తీసుకుని వెళతాడు. అడవి మధ్యలో ఒక భయంకరమైన గుహ ఉందనీ, ఆ గుహలో ఒక మాంత్రికురాలు 'కౌరిబురిదేవి'ని పూజిస్తుందని ఆ వ్యక్తి భవతారణ్ తో చెబుతాడు. ఆ గుహలోనే 'గోలోక్ పుష్పం' ఉందనీ, విషానికి విరుగుడులా పనిచేసే ఆ పుష్పమే మాధురిని కాపాడగలుగుతుందని అంటాడు. అయితే ఆ పుష్పాన్ని అక్కడి నుంచి తీసుకురావడం అనుకున్నంత తేలిక కాదని చెబుతాడు. అంతకంటే ముందుగా మాధురి భర్త ఆచూకీ తెలుసుకోవడం అవసరమని అంటాడు. ఆ మాంత్రికురాలు ఎవరు? ఆమె లక్ష్యం ఏమిటి? ఆ గుహలో నించి భవతారణ్ ఆ పుష్పాన్ని సంపాదించగలుగుతాడా? అనేది కథ. ఇది ఒక సూపర్ నేచురల్ థ్రిల్లర్. బెంగాలీ జానపద కథ ఆధారంగా రూపొందించబడిన సిరీస్. అది ఒక దట్టమైన అడవి .. ఆ అడవిలో ఒక భయంకరమైన గుహ .. ఆ గుహలో ఒక లక్ష్యాన్ని ఆశించి తాంత్రిక పూజలు చేసే మాంత్రికుడు .. అతని అధీనంలో ఒక మాయా పుష్పం .. ఎలాంటి వ్యాధినైనా నివారించి బ్రతికించగల శక్తి ఆ మాయా పుష్పానికి ఉంటుంది. మహారాజు ప్రాణాలను కాపాడటం కోసం బయల్దేరిన కథానాయకుడు ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటాడు? అనే జానపద కథ చాలామందికి తెలిసిందే. అదే దారిలో అదే తీరుగా నడిచే కథ ఇది. ఈ కథలో కథానాయకుడు తాను ఇష్టపడిన అమ్మాయిని క్షుద్రశక్తుల బారి నుంచి కాపాడటం కోసం రంగంలోకి దిగుతాడు. ఆ ప్రయత్నంలో తనకి ఎదురైన అవాంతరాలను అధిగమిస్తూ వెళతాడు. క్షుద్రపూజలు .. నరబలులు .. మంత్రించబడిన కాకులు .. రక్త స్పర్శ కారణంగా వికసించే మాయా పుష్పం .. వంటి అంశాలు ఈ సిరీస్ పై ఆసక్తిని పెంచుతూ వెళతాయి. రాత్రివేళలో అడవి నేపథ్యంలో సన్నివేశాలు మరింత ఉత్కంఠకు కారణమవుతాయి. అసలు 'కౌరిబురి' అమ్మవారు ఎవరు? అడవి నేపథ్యం .. దట్టమైన పొగ .. మంత్రించిన కాకుల గుంపులు ఎందుకోసం? వాటి వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటి? అనే ఒక సందేహం ప్రేక్షకులకు వస్తుంది. అందుకు ఇచ్చిన వివరణ కనెక్ట్ అవుతుంది. స్క్రీన్ పై అందుకు సంబంధించిన హడావిడినే కొంతవరకూ భయపడుతుంది. సాధారణంగా క్షుద్రపూజలు చేసేవారికి ఏదో ఒక లక్ష్యం అయితే ఉంటుంది. తమ శక్తిని పెంచుకోవడమే ప్రధానంగా కనిపిస్తుంది. కానీ ఈ కథలో క్షుద్రపూజలు చేసే మాంత్రికురాలి లక్ష్యం ప్రేక్షకులను కాస్త ఇబ్బంది పెడుతుంది.

అంశం దగ్గరే ఈ కథ కాస్త పక్కకి వెళ్లినట్టుగా అనిపిస్తుంది. మరో అంశం ఏదైనా ఎంచుకుంటే బాగుండేది అనే అభిప్రాయం కలుగుతుంది. క్షుద్రశక్తులు ఆవహించడం .. అవి ఆవహించినవాళ్లు చిత్రంగా ప్రవర్తించడం గట్రా ఈ సిరీస్ లో కనిపించవు. అది కూడా కాస్త వెలితిగా అనిపించే అంశమే. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదు. ప్రధానమైన పాత్రలను పోషించిన ఆర్టిస్టులంతా బాగానే చేశారు. ఇక ఈ తరహా కథలలో చివరికి వచ్చేసరికి దైవశక్తికి .. దుష్టశక్తికి మధ్య భీకరమైన పోరాటమే జరుగుతూ ఉంటుంది. ఒక రేంజ్ లో క్లైమాక్స్ ను డిజైన్ చేస్తుంటారు. కానీ ఈ సిరీస్ లో క్లైమాక్స్ చాలా సింపుల్ గానే సరిపెట్టారని చెప్పాలి. కొంతమందికి అది సహజంగా అనిపిస్తే, మరికొందరికి అసంతృప్తిని కలిగించే అవకాశం ఉంది.

ప్రతి అమ్మాయికి కనెక్ట్ అవుతుంది



'ఛాంపియన్' చిత్రంతో తెలుగులో అరంగేట్రం చేసి యువతరానికి చేరువైంది మలయాళీ సుందరి అనస్వర రాజన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఆమె నటించిన తాజా చిత్రం 'ఇట్లు అర్జున' ఈ నెల 13న రిలీజ్ కానుంది. అనీష్ హీరోగా చయమవుతున్న ఈ చిత్రానికి మహేష్ ఉప్పల దర్శకుడు. ఈ సందర్భంగా శుక్రవారం కథానాయిక అనస్వర రాజన్ విలేకరులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను కీర్తి అనే అమాయకపు అమ్మాయి పాత్రలో కనిపిస్తానని, ఇప్పటివరకు చేసిన పాత్రల్లో ఇది చాలా భిన్నమైనదని చెప్పింది. 'కీర్తి పాత్రతో ప్రతీ అమ్మాయి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో హీరో మూగ వ్యక్తిగా కనిపిస్తాడు. అతను ప్రేమను ఎలా వ్యక్తీకరిస్తాడన్నది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఇప్పటివరకు ఈ తరహా కథాంశం తెలుగులో రాలేదనుకుంటున్నా' అని చెప్పింది. తెలుగు హీరోల్లో అల్లు అర్జున్‌కు తాను మానినని, ఆయన్ని కలుసుకోవాలని ఉత్సాహంగా ఎదురుచూస్తున్నానని అనస్వర రాజన్ పేర్కొన్నది. 'ఇట్లు అర్జున' చిత్రాన్ని నాగార్జున వంటి అగ్ర టుడు ప్రజెంట్ చేయడం చాలా గర్వంగా ఉందని, సినిమా విజయంపై మరింత నమ్మకం పెరిగిందని తెలిపింది. ప్రస్తుతం తెలుగులో చిరంజీవి 'కాకా', రవితేజ 'తులాభారం'చిత్రాల్లో కీలక పాత్రల్ని పోషిస్తున్నానని, అలాగే సంగీత్ శోభన్‌తో కలిసి ఓ సినిమా చేస్తున్నానని అనస్వర రాజన్ చెప్పింది.

నటి సురేఖ వాణి ఇన్‌స్టాగ్రామ్

అకౌంట్ హ్యాక్..

- ప్రైవేట్ వీడియోలు వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం!



ప్రముఖ తెలుగు నటి సురేఖ వాణి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాక్ కావడంతో సోషల్ మీడియాలో కలకలం రేగింది. హ్యాకర్లు ఆమెకు సంబంధించిన కొన్ని వ్యక్తిగత, ప్రైవేట్ కంటెంట్‌ను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేయడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది. ఈ పరిణామంపై సురేఖ వాణి తీవ్రంగా స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు.తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయిందని, తన ప్రైవేట్ కంటెంట్‌ను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మీమ్ పేజీలు, మీడియా సంస్థలు, యూట్యూబ్ ఛానెల్స్ మరియు సోషల్ మీడియా యూజర్లు ఎవరైనా సరే తన వ్యక్తిగత కంటెంట్‌ను షేర్ చేయడం, రీపోస్ట్ చేయడం లేదా అప్‌లోడ్ చేయడం వెంటనే ఆపేయాలని ఆమె స్పష్టం చేశారు. కేవలం వ్యూస్, లైక్స్ మరియు పబ్లిసిటీ కోసం ఇలాంటి బాధ్యతారహితమైన పనులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు.ఇది తన వ్యక్తిగత గౌరవానికి సంబంధించిన అత్యంత సున్నితమైన అంశమని, దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సురేఖ వాణి స్పష్టం చేశారు. ఈ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఎవరైనా సరే తన ప్రైవేట్ కంటెంట్‌ను షేర్ చేసినా, ప్రచారం చేసినా వారి వివరాలు సేకరించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తన ప్రైవసీని గౌరవించాలని ఆమె అందరికీ విజ్ఞప్తి చేశారు.

'రామాయణ'పై

టాలీవుడ్ ప్రముఖుల ప్రశంసలు..

బాలీవుడ్ స్టార్స్ మాత్రం ఎందుకు మౌనం, ఇండస్ట్రీలో కొత్త చర్చ!



భారతీయ సినీ చరిత్రలో అత్యంత ప్రతిష్టాత్మక చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందని భావిస్తున్న 'రామాయణం'పై ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. నితీష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయిపల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోందని ప్రచారం జరుగుతోంది. మరోవైపు, ఈ సినిమాను చూసిన పలువురు టాలీవుడ్ ప్రముఖులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ చిత్ర బృందాన్ని అభినందించారు. అయితే బాలీవుడ్‌కు చెందిన పలువురు అగ్ర తారలు మాత్రం ఇప్పటివరకు ఈ సినిమాపై బహిరంగంగా స్పందించకపోవడం చర్చనీయాంశంగా మారింది. 'రామాయణ' చిత్రంపై టాలీవుడ్ నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు, దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వంటి ప్రముఖులు ఈ సినిమాపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసారు. భారీ స్థాయిలో రూపొందిన ఈ పౌరాణిక చిత్రాన్ని, దాని నిర్మాణ విలువలను వారు ప్రశంసించడం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచింది. అయితే ఇదే సమయంలో బాలీవుడ్‌కు చెందిన అగ్ర హీరోలు, దర్శకులు ఈ సినిమాపై స్పందించకపోవడం కొందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా రణ్‌బీర్ కపూర్ నటించిన ఈ చిత్రంపై బాలీవుడ్ ప్రముఖుల నుంచి పెద్దగా ప్రశంసలు వినిపించకపోవడంపై సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. సినిమా విడుదలై ప్రేక్షకుల ముందుకు వచ్చినప్పటికీ, హిందీ చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులు కనీసం సోషల్ మీడియా వేదికగా కూడా అభినందనలు తెలపలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో తెలుగు సినిమా పరిశ్రమ నుంచి వచ్చిన 'బాహుబలి 2', 'ఆర్ఆర్ఆర్', 'పుష్ప', 'కల్కి 2898 ఏడీ' వంటి చిత్రాలు దేశవ్యాప్తంగా భారీ విజయాలను అందుకున్నాయి. ఈ సినిమాలకు ఇతర భాషల్లోనూ విశేష ఆదరణ లభించింది. అయితే అప్పట్లోనూ బాలీవుడ్‌కు చెందిన కొందరు అగ్ర తారలు ఈ చిత్రాలపై బహిరంగంగా స్పందించలేదనే చర్చ సాగింది. ఇప్పుడు 'రామాయణ' విషయంలోనూ అదే పరిస్థితి కనిపిస్తోందని కొందరు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. నిజానికి పాన్ ఇండియా సినిమా అంటే ఒక భాషకు, ఒక పరిశ్రమకు మాత్రమే పరిమితం కాకుండా దేశంలోని అన్ని సినీ పరిశ్రమల ప్రేక్షకులను ఆకట్టుకోవడం. అలాంటి సినిమాలను అన్ని పరిశ్రమల ప్రముఖులు అభినందిస్తే భారతీయ సినిమా ఐక్యత మరింత బలపడుతుందనే అభిప్రాయం ఉంది. ఒక పరిశ్రమలోని నటీనటులు మరో పరిశ్రమ సినిమాలను ప్రశంసించడం, మంచి సినిమాలకు మద్దతుగా నిలవడం ఆరోగ్యకరమైన సినీ వాతావరణానికి దోహదపడుతుంది. అయితే బాలీవుడ్ ప్రముఖులు మౌనంగా ఉండటానికి కారణం ఏమిటనేది స్పష్టంగా తెలియదు. వారు సినిమా చూడకపోవడం, స్పందించడానికి అవకాశం లేకపోవడం లేదా వ్యక్తిగత కారణాలు ఉండవచ్చు. కేవలం ప్రశంసలు తెలపలేదనే కారణంతో వారి ఉద్దేశాలను అంచనా వేయడం సరైంది కాదు. అయినప్పటికీ ఈ మౌనంపై సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చ మాత్రం ఆసక్తిని రేకెత్తిస్తోంది.

తెలంగాణ 'చంద్రయాన్'



చంద్రుడి మీదకు స్పేస్ క్రాఫ్ట్‌ని పంపించే ఓ బిగ్ మిషన్‌ను తెలంగాణలోని మందమర్రికి చెందిన నలుగురు యువకులు చేపడతారు. ఈ క్రమంలో వారు ఎదుర్కొనే సమస్యలను వినోదాత్మకంగా ఆవిష్కరిస్తూ రూపొందించిన చిత్రం 'చంద్రయాన్'. శివకుమార్ ధీకొండ, స్వప్న ప్రియదర్శిని, రవి శివతేజ, వంశీధర్ తదితరులు ప్రధాన పాత్రధారులు. శ్రీనాథ్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ప్రవీణ్ మొలక నిర్మిస్తున్నారు. ఈ నెల 13న విడుదలకానుంది. శుక్రవారం ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. గూగుల్ సహాయంతో రాకెట్ తయారు చేసి స్పేస్‌లోకి పంపాలని నలుగురు యువకులు చేసే ప్రయత్నాలు, ఈ క్రమంలో ఊరిలో చోటుచేసుకునే ఓ హత్య నేపథ్యంలో ట్రైలర్ ఆసాంతం వినోదం, ఉత్కంఠ ప్రధానంగా సాగింది. చివరకు వారి చంద్రయాన్ ప్రయత్నాలు ఏ మేరకు ఫలించాయో అనే సస్పెన్స్‌తో ట్రైలర్‌ను ముగించారు.

వనవాసం ఎప్పుడు ముగుస్తుందో?



నటి రేణు దేశాయ్ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అగ్ర నటుడు పవన్‌కల్యాణ్ నుంచి విడాకులు తీసుకొని 14ఏండ్లు గడిచినా తనను ఇప్పటికీ ఆయన మాజీ భార్యగానే గుర్తిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. 'విశాల్ టాక్స్' అనే పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఆమె వ్యక్తిగత జీవితంలో తాను ఎదుర్కొంటున్న విమర్శలతో పాటు సాధించిన విజయాల గురించి అభిప్రాయాల్ని వెల్లడించారు. '2000 సంవత్సరంలో 'బద్రి' సినిమా కోసం హైదరాబాద్ వచ్చాను. కానీ అంతకుముందే నాకంటూ ఓ జీవితం ఉందనే విషయం ఎవరూ పట్టించుకోవడం లేదు.విడాకులు తీసుకొని 14ఏండ్లు గడిచిపోయాయి. శ్రీరాముడు కూడా పద్నాలుగేళ్లే వనవాసం చేశాడు.మరి నా వనవాసం ఎప్పుడు ముగుస్తుందో? అని రేణూ దేశాయ్ ప్రశ్నించారు. విడాకుల అనంతరం తాను వ్యక్తిగత జీవితంలో ఎన్నో విజయాలను సాధించానని రేణు దేశాయ్ గుర్తుచేసుకున్నారు. ఓ మరాఠి చిత్రాన్ని నిర్మించి మంచి విజయాన్ని అందుకున్నానని, మరో సినిమాకు రచన, నిర్మాణం, దర్శకత్వ బాధ్యతలు కూడా చేపట్టానని ఆమె అన్నారు. డ్యాన్స్ రియాలిటీ షోలో పాల్గొనడంతో పాటు కవిత్వం రాశానని, తిరిగి సినిమాల్లో నటించానని రేణు దేశాయ్ తెలిపారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు లేకపోతే ఇలాంటి అవకాశాలు ఎందుకొస్తాయని ఆమె ప్రశ్నించారు. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

నిడదవోలులో కూటమి క్లీన్‌స్వీప్

62 ఎంపీటీసీలకు 54 చోట్ల విజయం

మూడు మండలాల్లో కూటమి ప్రభంజనం మూడు జెడ్పీటీసీలూ కైవసం



నిడదవోలు (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో నిడదవోలు నియోజకవర్గంలో కూటమి విజయదుందుభి మోగించింది. ఉండ్రాజవరం, పెరవలి, నిడదవోలు మండలాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులు ఘన విజయాలు సాధించడంతో రాజకీయంగా కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. మొత్తం 62 ఎంపీటీసీ స్థానాలకు గాను 54 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. మూడు మండలాల జెడ్పీటీసీ స్థానాలనూ కూటమి కైవసం చేసుకుంది. ఈ ఫలితాలు ప్రజలు కూటమి పాలనకు ఇచ్చిన మద్దతుగా నిలుస్తున్నాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.నిడదవోలు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సాధించిన విజయాన్ని ప్రజాస్వామ్య విజయంగా అభివర్ణించారు. ఎన్నికలు ఈవీఎంల ద్వారా జరిగినా.. బ్యాలెట్ ద్వారా జరిగినా.. పట్టణ ప్రాంతమైనా, గ్రామీణ ప్రాంతమైనా ప్రజలు కూటమి వైపే నిలిచారని పేర్కొన్నారు. గెలుపొందిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

62లో 54.. కూటమికి తిరుగులేని ఆధిక్యం..

నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మొత్తం 62 ఎంపీటీసీ స్థానాలకు గాను 54 స్థానాలను కూటమి కైవసం చేసుకుందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇందులో తెలుగుదేశం పార్టీ 29, జనసేన 24, బీజేపీ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయని వివరించారు.మూడు జెడ్పీటీసీ స్థానాలనూ కూటమి అభ్యర్థులే గెలుచుకున్నారని తెలిపారు. పెరవలి మండలంలో టీడీపీ విజయం సాధించగా.. ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో జనసేన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారని పేర్కొన్నారు. ఉండ్రాజవరం జెడ్పీటీసీ స్థానంలో జనసేన సాధించిన విజయం ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు.పలు ప్రాంతాల్లో 11 వేలకుపైగా భారీ మెజారిటీలు రావడం ప్రజల్లో కూటమి పట్ల ఉన్న నమ్మకానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. విజయం సాధించిన ప్రజాప్రతినిధులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్కరికీ మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. టికెట్ రాకపోయినా నిరాశ చెందకుండా కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తల సేవలను కొనియాడారు. ప్రజాసేవకు అవకాశం కల్పించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

“29”కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

-ఎమ్మెల్యే శ్రీ గణేష్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని తిరుమలగిరి మండలంలో మధ్యతరగతి కుటుంబం కారణంగా తల్లిదండ్రులు తమ కూతురి పెళ్లికి అప్పులపాలై ఇబ్బంది పడకూడదనే సత్సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది.పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పిస్తూ,రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ‘కళ్యాణలక్ష్మి’, ‘షాదీ ముబారక్’పథకాలు నిరుపేద కుటుంబాలకు “శ్రీరామరక్ష”గా నిలుస్తున్నాయి. తాజాగా, కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీగణేష్ ప్రత్యేక చొరవతో తిరుమలగిరి మండల వాసులకు ఈ పథకం కింద అందాల్సిన ఆర్థిక సహాయం సకాలంలో చేరింది.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో తిరుమలగిరి మండలానికి చెందిన మొత్తం 29 మంది అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ స్వయంగా కళ్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల ముఖాల్లో చిరునవ్వులు చిందించాయి.తమ కుమార్తెల వివాహ వేడుకలకు ప్రభుత్వ సాయం నేరుగా చేరడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి,పేదల అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.

ఏ వర్గానికి చెందిన వారైనా, ఏ మతాని వారైనా పేద కుటుంబంలోని ఆడబిడ్డల పెళ్లి తల్లిదండ్రులకు భారంగా మారకూడదన్నదే ముఖ్యమంత్రి ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతీ పథకాన్ని అర్హులైన నిజమైన నిరుపేదలకు పారదర్శకంగా అందిస్తోందని తెలిపారు. అధికారులను, సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వాల హయాంలోనూ లేని విధంగా నేడు అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఎలాంటి సిఫారసులు లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా అందుతున్నాయని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. పేదల ఇళ్లల్లో పెళ్లి సందడి అట్టహాసంగా జరిగేలా సీఎం తీసుకుంటున్న ఈ చరిత్రాత్మక నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది.తిరుమలగిరి మండలంలో చెక్కులు అందుకున్న కుటుంబాలు ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుమల గిరి ఎమ్మార్వో భిక్షపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు
ఉత్తరయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగలలో సైకిల్ జోరు..

వంతల రాజేశ్వరికి జెడ్పీ పీఠం

- 2,433 ఓట్ల మెజార్టీతో వైసీపీ ప్రత్యర్థిపై ఘన విజయం

- 11 ఎంపీటీసీల్లో ఏడు టీడీపీ ఖాతాలోకి, కూటమి శ్రేణుల్లో సంబరాలు



అడ్డతీగల(ప్రశ్న న్యూస్) నూతన పోలవరం జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. జిల్లా తొలి జడ్పీ చైర్మన్ పీఠాన్ని దక్కించుకునే దిశగా కూటమి అడుగులు వేస్తుండగా.. అడ్డతీగల మండలంలో తెలుగుదేశం పార్టీ తన పట్టును మరోసారి చాటుకుంది. జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి 2,433 ఓట్ల ఆధిక్యంతో ఘన విజయం సాధించారు. వైసీపీ తరఫున బరిలో నిలిచిన నాగులపల్లి గంగాభవానిపై ఆమె విజయం సాధించడంతో టీడీపీ శ్రేణుల్లో సంబరాలు వెల్లివిరిశాయి.మొదటి నుంచి ఆసక్తి రేకెత్తించిన జడ్పీటీసీ పోరులో వంతల రాజేశ్వరి బ్యాలెట్ ఓట్ల లెక్కింపు నుంచే ఆధిక్యాన్ని ప్రదర్శించారు. చివరి వరకు అదే జోరును కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నారు. జడ్పీ చైర్మన్ రేసులో ముందంజలో ఉన్న ఆమె గెలుపు కూటమి నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపింది. కొత్త జిల్లాలో తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా మహిళకు అవకాశం దక్కే నేపథ్యంలో ఈ విజయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

11 ఎంపీటీసీల్లో ఏడు టీడీపీకి..

అడ్డతీగల మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కూటమి పొత్తులో భాగంగా జనసేనకు రెండు, బీజేపీకి ఒక స్థానం కేటాయించారు. ఈ మూడు స్థానాలతో పాటు గొంటువానిపాలెంలో టీడీపీ అభ్యర్థి ఓటమి పాలయ్యారు. మిగిలిన ఏడు ఎంపీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుంది. దీంతో మండలంలో టీడీపీ బలం స్పష్టమైంది.మండల కేంద్రంలోని రెండు ఎంపీటీసీ స్థానాల్లో ఒకటో స్థానాన్ని వైసీపీ అభ్యర్థి చింతపల్లి రఘునాథ్ దక్కించుకున్నారు. జనసేన అభ్యర్థి కృష్ణారెడ్డిపై ఆయన 11 ఓట్ల స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించారు. రెండో ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి ఎడ్ల శ్రీదేవి, వైసీపీ అభ్యర్థి వడ్లమూరి రత్నంపై 96 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.సోమన్నపాలెంలో టీడీపీ బలపరిచిన చెక్క వెంకటరమణ వైసీపీ అభ్యర్థి కోసూరి శ్రీరాములుపై 375 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. తిమ్మాపురంలో టీడీపీ అభ్యర్థి కోసూరు హంసలేఖ 77 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ధాన్యంపాలెంలో టీడీపీ అభ్యర్థి మడకం భాగ్యలక్ష్మి, వైసీపీ అభ్యర్థి మడకం కామేశ్వరిపై 251 ఓట్ల తేడాతో విజయం సాధించారు.వీరవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సింగంశెట్టి ఆదిలక్ష్మి విజయం సాధించారు. వేటమామిడిలో టీడీపీ మండల అధ్యక్షుడు జర్తా వెంకటరమణారెడ్డి వైసీపీ అభ్యర్థిపై ఘన విజయం సాధించారు. డి.రామవరం ఎంపీటీసీ స్థానంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి సోదరుడు వంతల సూర్యనారాయణరెడ్డి గెలుపొందారు.దొరమామిడిలో వైసీపీ అభ్యర్థి పడాల వెంకటరమణ అలియాస్ బాబి, జనసేన అభ్యర్థి గోకురబోయిన అరుణపై విజయం సాధించారు. ఎల్లవరంలో వైసీపీ నాయకుడు నక్క మోహన్ బీజేపీ అభ్యర్థిపై గెలుపొందారు.

కూటమి శ్రేణుల్లో కొత్త ఉత్సాహం..

అడ్డతీగల మండలంలో వంతల రాజేశ్వరి విజయం, టీడీపీకి దక్కిన ఎంపీటీసీ స్థానాలు పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. రాజేశ్వరి పట్ల మండలంలో సానుభూతి పవనాలు వీచాయని, కొన్ని చోట్ల ఓటమి అంచనాలున్న అభ్యర్థులు కూడా విజయం సాధించారని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రత్యర్థులు తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ జడ్పీటీసీ స్థానాన్ని చేజిక్కించుకోలేకపోయారు.కొత్త పోలవరం జిల్లాలో జడ్పీ చైర్‌పర్సన్ పదవితో పాటు అత్యధిక మండలాల్లో ఎంపీపీ పీఠాలు కూటమికి దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక ఎన్నికల ఫలితాలు జిల్లాలో రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేయనున్నాయి. అడ్డతీగలలో కూటమి సాధించిన విజయంతో అభివృద్ధి కార్యక్రమాలకు మరింత ఊతం లభిస్తుందని స్థానిక రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రజలు ఇచ్చిన తీర్పును అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా నిలబెట్టుకోవడమే కూటమి ముందున్న సవాల్‌గా మారింది. కొత్త జిల్లాలో పాలనా పగ్గాలు కూటమి చేతుల్లోకి వస్తే, గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రజల ఆశలు మరింత పెరగనున్నాయి.

పాయకరావుపేటలో కూటమి క్లీన్‌స్వీప్

- ఎస్.రాయవరంలో అమలకంటి రమణమ్మ విజయం

- నక్కపల్లిలో హోంమంత్రి అనిత నివాసం వద్ద విజయోత్సవ సంబరాలు



నక్కపల్లి (ప్రశ్న న్యూస్) పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి విజయదుందుభి మోగించింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో నాలుగు మండలాల జెడ్పీటీసీ స్థానాలనూ కైవసం చేసుకుని కూటమి తన రాజకీయ ఆధిపత్యాన్ని చాటుకుంది. టీడీపీ, బీజేపీ అభ్యర్థులు భారీ మెజారిటీలతో విజయం సాధించడంతో నియోజకవర్గంలో పసుపు జెండా రెపరెపలాడింది. గ్రామీణ ప్రాంతాల్లో కూటమికి లభించిన ప్రజా మద్దతు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.నియోజకవర్గంలోని ఎస్.రాయవరం, కోటవురట్ల, పాయకరావుపేట, నక్కపల్లి మండలాల్లో జెడ్పీటీసీ స్థానాలను కూటమి అభ్యర్థులు కైవసం చేసుకున్నారు. ఎస్.రాయవరంలో టీడీపీ అభ్యర్థి అమలకంటి రమణమ్మ ఏకంగా 13,231 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మిగిలిన మూడు మండలాల్లోనూ కూటమి అభ్యర్థులు గెలుపొందడంతో నాలుగు స్థానాలూ కూటమి ఖాతాలో చేరాయి.

భారీ మెజారిటీలతో విజయకేతనం..

పాయకరావుపేట నియోజకవర్గంలో మండలాల వారీగా జెడ్పీటీసీ ఎన్నికల ఫలితాలు కూటమి శ్రేణుల్లో హర్షాతిరేకాలు నింపాయి.
ఎస్.రాయవరం: టీడీపీ అభ్యర్థి అమలకంటి రమణమ్మ 13,231 ఓట్ల భారీ మెజారిటీతో విజయం.
కోటవురట్ల టీడీపీ అభ్యర్థి పురం నాగవేణి 3,889 ఓట్ల మెజారిటీతో గెలుపు.

అనిత నివాసం వద్ద విజయోత్సవ సందడి..

ఎన్నికల ఫలితాలతో నక్కపల్లిలోని హోంమంత్రి వంగలపూడి అనిత నివాసం వద్ద విజయోత్సవాలు అంబరాన్నంటాయి. కూటమి అభ్యర్థుల విజయంతో ఉత్సాహంగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆమె నివాసానికి చేరుకున్నారు. డప్పుల మోతలు, నినాదాలు, కార్యకర్తల నృత్యాలతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.హోంమంత్రి అనితను కలిసిన కూటమి నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో సాధించిన విజయంపై శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన మద్దతుకు నాయకులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు.కార్యకర్తలతో కలిసి విజయోత్సవాల్లో పాల్గొన్న అనిత వారిని అభినందించారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, ప్రజాసేవ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని కూటమి శ్రేణులకు సూచించారు.

పూర్ణాహుతితో పవిత్రోత్సవాలకు పరిసమాప్తి

- శ్రీనివాసమంగాపురంలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

- శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం



శ్రీనివాసమంగాపురం(ప్రశ్న న్యూస్) వేదమంత్రాల నాదం.. వైదిక క్రతువుల పవిత్రత.. అర్చకుల ఆగమోక్త పూజలు.. భక్తుల గోవింద నామస్మరణల మధ్య శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు వైభవంగా ముగిశాయి. మూడు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పవిత్రోత్సవాలకు శనివారం పూర్ణాహుతితో సంపూర్ణత చేకూరింది. యాగశాలలో నిర్వహించిన వైదిక కార్యక్రమాలు, కుంభప్రోక్షణతో ఉత్సవాలు శాస్త్రోక్తంగా పరిసమాప్తమయ్యాయి.ఆలయ సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర విధానాలకు అనుగుణంగా నిర్వహించిన ఈ పవిత్ర క్రతువుల్లో స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా భక్తులకు విశేష దర్శనమిచ్చారు. చివరి రోజు ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, తోమాలసేవ, కొలువు నిర్వహించారు. అనంతరం యాగశాలలో అర్చకులు వైదిక కార్యక్రమాలను కొనసాగించారు.

పంచామృతాలతో విశేష అభిషేకం..

పవిత్రోత్సవాల్లో భాగంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేష అభిషేకం చేశారు. మంగళకరమైన మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ అభిషేక ఘట్టం భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తింది. స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకున్న భక్తులు గోవింద నామస్మరణతో తరించారు.

పూర్ణాహుతితో ముగిసిన పవిత్ర క్రతువు..

చివరి రోజు సాయంత్రం యాగశాలలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. శాస్త్రోక్త విధానంలో పూర్ణాహుతి



సమర్పించి, అనంతరం కుంభప్రోక్షణ జరిపారు. ఆచార్యులకు బహుమానం సమర్పించడంతో మూడు రోజుల పవిత్రోత్సవాలకు సంపూర్ణత లభించింది. ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక వైభవం మరింత పెంపొందించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ ఉత్సవాలు భక్తులకు భక్తిభావాన్ని పంచాయి.

అధికారులు, అర్చకులు, భక్తుల భాగస్వామ్యం..

ఈ పవిత్రోత్సవాల్లో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, హరికృష్ణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.మూడు రోజుల పాటు సాగిన పవిత్రోత్సవాలు పూర్ణాహుతితో ముగియడంతో శ్రీనివాసమంగాపురం ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. స్వామివారి దివ్యానుగ్రహం కోసం భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

పెట్రోల్‌లో నీళ్ల కలకలం..
వాహనదారుడి ఆందోళన

- భారత్ పెట్రోల్ బంక్‌లో ఘటన జరిగినట్లు వాహనదారుడి ఆరోపణ
- పెట్రోల్ పోసుకున్న కొద్దిసేపటికే నిలిచిపోయిన ద్విచక్ర వాహనం
- ఘటనతో సంబంధం లేదంటున్న బంక్ యాజమాన్యం





మేడ్చల్ పెట్రోల్‌లో నీళ్లు కలిశాయన్న ఆరోపణలు మేడ్చల్ పరిధిలో కలకలం రేపాయి. పెట్రోల్ బంక్‌లో ఇంధనం నింపించుకున్న కొద్దిసేపటికే ద్విచక్ర వాహనం నిలిచిపోవడంతో అనుమానం వచ్చిన వాహనదారుడు పెట్రోల్‌ను తనిఖీ చేయగా అందులో నీళ్లు ఉన్నట్లు గుర్తించానని ఆరోపించాడు. దీంతో ఆగ్రహానికి గురైన బాధితుడు పెట్రోల్ బంక్‌కు చేరుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగాడు. ఈ ఘటన గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని మైనమ్మగూడ శివారులో ఉన్న భారత్ పెట్రోల్ బంక్‌లో చోటుచేసుకుంది.

వాహనం ఆగిపోవడంతో అనుమానం..

గుండ్లపోచంపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ నాయకుడు నవీన్ సదరు పెట్రోల్ బంక్‌లో తన ద్విచక్ర వాహనానికి పెట్రోల్ పోయించుకున్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే వాహనం తిరిగి స్టార్ట్ కాకపోవడంతో అనుమానం వ్యక్తం చేశాడు. పెట్రోల్‌ను బయటకు తీసి పరిశీలించగా నీళ్లు కలిసినట్లు గుర్తించానని తెలిపాడు. దీంతో వెంటనే పెట్రోల్ బంక్‌కు వెళ్లి సిబ్బందిని నిలదీశాడు. పెట్రోల్‌కు బదులుగా నీళ్లు వస్తే వాహనాలు ఎలా నడుస్తాయని, ఇలాంటి ఘటనల వల్ల వాహనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశాడు.

బంక్ యాజమాన్యం వివరణ మరోలా..

ఈ ఘటనతో తమ పెట్రోల్ బంక్‌కు ఎలాంటి సంబంధం లేదని యజమాని కిషోర్ రెడ్డి పేర్కొంటున్నారు. పెట్రోల్‌లో ఇంధనంతో పాటు ఆయిల్ కలిసినప్పుడు లేదా ఇతర కారణాల వల్ల ద్రవాలు వేరువేరుగా కనిపించే అవకాశం ఉందని, ఈ ఘటనపై తమకు సంబంధం లేదని స్పష్టం చేస్తున్నారు.

నాణ్యతపై తనిఖీలు చేయాలి..

పెట్రోల్‌లో నీళ్లు కలిశాయన్న ఆరోపణలు వాహనదారుల్లో ఆందోళనకు కారణమవుతున్నాయి. ఇంధన నాణ్యతపై అనుమానాలు వ్యక్తమైనప్పుడు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఆరోపణల్లో వాస్తవాలు తేల్చి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. ఇంధనం నాణ్యత విషయంలో పెట్రోల్ బంక్ యాజమాన్యాలు కూడా నిర్లక్ష్యం చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు సూచిస్తున్నారు.

ఖాళీ స్థలాలను పార్కులుగా అభివృద్ధి చేస్తాం
- సీఎంసీ కమిషనర్ సృజన



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు కమిషనర్ జి. సృజన తెలిపారు. శనివారం సీఎంసీ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 770 ఖాళీ స్థలాలు ఉండగా, 300 స్థలాలకు ప్రహరీ గోడలు నిర్మించామని, మిగిలిన 470 స్థలాలకు కూడా గోడలు నిర్మించి పార్కులుగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.పార్కుల్లో నడక మార్గాలు, బహిరంగ వ్యాయామ పరికరాలు, పిల్లల ఆట స్థలాలు, వృద్ధులకు విశ్రాంతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల కోసం పార్కుల్లో కుర్చీలు, బెంచీలు, వైఫై సౌకర్యంతో 'వర్క్ ఫ్రమ్ పార్క్' కార్యక్రమాన్ని ప్రారంభించి, విజయవంతమైతే అన్ని డివిజన్లకు విస్తరిస్తామని తెలిపారు.అభివృద్ధి పనుల వివరాలు, కాంట్రాక్టర్ పేరు, వ్యయం, అధికారుల వివరాలు, ఫిర్యాదుల కోసం క్యూ ఆర్ కోడ్‌తో కూడిన బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. రీసైక్లింగ్ ప్లాస్టిక్‌తో బెంచీలు, కుర్చీలు తయారు చేయడంతో పాటు పునర్వినియోగ నీటిని వినియోగించాలని నిర్మాణదారులకు సూచించారు. ప్రతి నిర్మాణ ప్రదేశంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు.యునిసెఫ్ సహకారంతో 'చైల్డ్ ఫ్రెండ్లీ సీఎంసీ' కార్యక్రమం ద్వారా 76 వార్డుల్లో విద్యార్థుల అభిప్రాయాలను సేకరించి పట్టణ ప్రణాళికలో భాగస్వామ్యం చేస్తామన్నారు. నవంబర్ 20 నుంచి 23 వరకు 'లిజనింగ్ టు చిల్డ్రన్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ రద్దీ తగ్గించేందుకు పోలీసుల సూచనలతో కూడళ్ల వద్ద ప్రత్యేక మార్గాల ఏర్పాటు, చెత్త పునర్వినియోగం, కొబ్బరి బోండాల వ్యర్థాలతో ఉపయోగకరమైన ఉత్పత్తుల తయారీపై కూడా దృష్టి సారిస్తున్నట్లు కమిషనర్ వివరించారు.

టీటీడీ సాధికారిక మండలిలోకి కన్నబాబు
శ్రీవారి సన్నిధిలో ప్రమాణస్వీకారం
బంగారు వాకిలి వద్ద ప్రమాణం చేయించిన అదనపు ఈవో వెంకయ్య చౌదరి
ధార్మిక వైభవాన్ని ఖండాంతరాలకు విస్తరించేందుకు కృషి చేస్తా: కె.కన్నబాబు



తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి సేవలో మరో కీలక బాధ్యతకు శ్రీకారం చుట్టారు కె.కన్నబాబు. టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా ఆంధ్రప్రదేశ్ దేవాదాయశాఖ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కె.కన్నబాబు శనివారం తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రమాణస్వీకారం చేశారు. అత్యంత పవిత్రమైన బంగారు వాకిలి వద్ద జరిగిన ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది.టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి ఆయనతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించారు. స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వదించారు.

శ్రీవారి సేవకు దక్కిన మహద్భాగ్యం..

ప్రమాణస్వీకారం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో కె.కన్నబాబు మాట్లాడుతూ.. కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవేంకటేశ్వర స్వామివారి పిలుపు, అనుగ్రహంతో తనకు ఈ గొప్ప అవకాశం లభించిందని భావోద్వేగంగా పేర్కొన్నారు. తనపై విశ్వాసం ఉంచి టీటీడీ సాధికారిక మండలి సభ్యుడిగా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్యమంత్రి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తన శక్తిమేరకు పూర్తిస్థాయిలో సేవలందిస్తానని స్పష్టం చేశారు. శ్రీవారి సేవలో భాగస్వామ్యం కావడం తనకు లభించిన గొప్ప అవకాశంగా భావిస్తున్నానని తెలిపారు.

ఖండాంతరాలకు శ్రీవారి ధార్మిక వైభవం..

సాధికారిక మండలి చైర్మన్ ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయ ధార్మికత, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తానని కన్నబాబు వెల్లడించారు. శ్రీవారి వైభవాన్ని మరింత విస్తృతంగా భక్తులకు చేరువ చేయడమే లక్ష్యంగా భక్తిశ్రద్ధలతో బాధ్యతలు నిర్వహిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్, బోర్డు సెల్ డిప్యూటీ ఈవో ప్రశాంతి, ఇతర టీటీడీ అధికారులు పాల్గొన్నారు. శ్రీవారి సన్నిధిలో జరిగిన ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం భక్తిభావంతో సాగింది.

దీపాల వెలుగుల్లో దీపావళి సంబరాలు
చీకటిపై వెలుగుల జయం

అప్రమత్తతే అసలైన ఆనందం.. బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

(ప్రశ్న న్యూస్ ప్రత్యేక కథనం మేడ్చల్ ప్రతినిధి చిన్న)





భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగల్లో దీపావళికి ప్రత్యేక స్థానం ఉంది. చెడుపై మంచి సాధించిన విజయానికి, అజ్ఞానమనే చీకటిపై జ్ఞానమనే వెలుగు ప్రసరించడానికి ప్రతీకగా దీపావళిని జరుపుకుంటారు. ప్రతి ఇంటి ముందు దీపాలు వెలిగిస్తూ, రంగురంగుల విద్యుత్ దీపాలతో ఇళ్లను అలంకరిస్తూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆనందంగా ఈ పండుగను జరుపుకుంటారు.

దీపావళి విశిష్టత ఏమిటి.?

పురాణాల ప్రకారం శ్రీరాముడు రావణాసురుడిని సంహరించి, 14 సంవత్సరాల వనవాసం ముగించుకుని అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగా ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారని చెబుతారు. మరోవైపు నరకాసురుడిపై శ్రీకృష్ణుడు సాధించిన విజయాన్ని కూడా దీపావళి పండుగతో అనుసంధానిస్తారు. అందుకే ఈ పండుగను చెడుపై మంచి విజయానికి చిహ్నంగా భావిస్తారు.దీపావళి రోజున లక్ష్మీదేవిని పూజించడం ఆనవాయితీ. సంపద, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఇళ్లను శుభ్రం చేసి, ముంగిళ్లలో రంగవల్లులు వేసి, దీపాలు వెలిగించడం ద్వారా పండుగకు ఆధ్యాత్మిక శోభను తీసుకొస్తారు.

బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం

దీపావళి అంటే దీపాల వెలుగులతో పాటు బాణసంచా సందడి కూడా గుర్తుకొస్తుంది. అయితే సరదా కోసం చేసే చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారితీయవచ్చు. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు తప్పనిసరిగా పర్యవేక్షించాలి. ఆనందం కోసం జరుపుకునే పండుగ విషాదంగా మారకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి.

తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు

- బాణసంచా కాల్చేటప్పుడు తప్పనిసరిగా బహిరంగ ప్రదేశాన్ని ఎంచుకోవాలి.
- పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే టపాసులు కాల్చాలి.
- టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు ధరించడం మంచిది. వదులుగా ఉండే దుస్తులకు దూరంగా ఉండాలి.
- చేతిలో పెట్టుకుని టపాసులు కాల్చకూడదు.
- వెలగని టపాసుల వద్దకు వెంటనే వెళ్లకూడదు. వాటిని మళ్లీ వెలిగించే ప్రయత్నం చేయకూడదు.
-టపాసుల దగ్గర నీటి బకెట్, ఇసుక లేదా అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి.
- ఇళ్లలో, వాహనాల దగ్గర, పెట్రోల్ బంకుల సమీపంలో బాణసంచా కాల్చకూడదు.
- రాకెట్లు, నిప్పురవ్వలు విద్యుత్ తీగలు, చెట్లు, భవనాల వైపు వెళ్లకుండా జాగ్రత్తపడాలి.
- కాలుష్యాన్ని తగ్గించే విధంగా తక్కువ శబ్దం, తక్కువ పొగ వెలువరించే అనుమతిపొందిన బాణసంచాకు ప్రాధాన్యత ఇవ్వాలి.
- చెవులు, కళ్లకు రక్షణ కల్పించాలి. కాలిన గాయాలు ఏర్పడితే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

పర్యావరణ పరిరక్షణ కూడా మన బాధ్యతే!

బాణసంచా వల్ల వెలువడే పొగ, శబ్దం వాతావరణాన్ని కలుషితం చేయడమే కాకుండా చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాస సంబంధిత సమస్యలున్నవారికి ఇబ్బందులు కలిగించవచ్చు. పక్షులు, మూగజీవులు కూడా అధిక శబ్దానికి భయపడతాయి. అందువల్ల సాధ్యమైనంత వరకు శబ్ద కాలుష్యాన్ని తగ్గిస్తూ పర్యావరణహితంగా పండుగ జరుపుకోవాలి.

ఆనందం పంచాలి.. ప్రమాదాలు కాదు

దీపావళి పండుగ అనేది కేవలం టపాసులు కాల్చడం, కొత్త దుస్తులు ధరించడం, స్వీట్లు పంచుకోవడం మాత్రమే కాదు. కుటుంబ సభ్యులతో ప్రేమానురాగాలను పంచుకోవడం, పేదలకు సహాయం చేయడం, సమాజంలో సంతోషాన్ని నింపడం కూడా ఈ పండుగలోని అసలైన సందేశం. మన ఇంట్లో వెలిగించే దీపం మరొకరి జీవితంలోనూ వెలుగులు నింపేలా ఉండాలి.

ప్రజలకు సందేశం

పండుగ వేడుకల్లో అత్యుత్సాహం ప్రదర్శించకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. పోలీస్, అగ్నిమాపక, వైద్య శాఖల సూచనలు పాటించాలి. దీపావళి వెలుగులు ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలి. ఎవరికీ ప్రమాదం కలగకుండా, పర్యావరణానికి హాని చేయకుండా పండుగను జరుపుకోవాలి. దీపాలు వెలిగిద్దాం.. చీకట్లను తరిమేద్దాం.. జాగ్రత్తలతో సంతోషాలను పంచుకుందాం!

చమురు శుద్ధిలో భారత్ దూకుడు
- అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది. 2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది.భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి.రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది. భారత్ రిఫైనింగ్ సామర్థ్యం పెరిగితే ప్రపంచ మార్కెట్‌లో సరఫరా సమతుల్యతను ప్రభావితం చేసే స్థాయిలో దేశం నిలుస్తుందని పేర్కొంది.

లడఖ్‌లో భారత వాయుసేన చారిత్రక ఘనత
- 13,629 అడుగుల ఎత్తులో భారత వాయుసేన ప్రపంచ రికార్డు



లడఖ్ (ప్రశ్న న్యూస్) లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది. ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది.చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588